
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
శుక్రవారం 21 మార్చి 2025 పేజీలు 8
గుంటూరు పల్నాడు

# అమరావతికి మళ్లీ ప్రధానే..!

అమరావతి రాజధాని పనుల శంకుస్థాపనకు ప్రధాని నరేంద్ర మోడీ వచ్చే అవకాశం ఉంది. మోడీ అమరావతి వస్తే ఇది రెండోసారి అవుతుంది. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అమరావతి రాజధాని నిర్మాణ పనుల శంకుస్థాపనకు ప్రధానిని ఆహ్వానించేందుకు ఢిల్లీ వెళ్లారు. ఈసారి రూ. 40 వేల కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ఈ పనులకు ప్రధాని శంకుస్థాపన చేయనున్నారు. ఇప్పటికే సిఆర్డిఏ అధికారులు ఇందుకోసం ఒక ప్రణాళికను సిద్ధం చేశారు. చేపట్టబోయే ప్రజలకు సంబంధించి మాస్టర్ ప్లాన్ కూడా రూపొందించారు. పనుల్లో పాల్గొనే కాంట్రాక్టర్లకు టెండర్లను ఖరారు చేసి అగ్రిమెంట్ కుదుర్చుకునే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. మంత్రులు, న్యాయమూర్తుల నివాసాలు, హైకోర్టు నిర్మాణం, మౌలిక సదుపాయాలు వంటివి ఈ శంకుస్థాపన పనుల్లో ఉన్నట్లు తెలుస్తోంది....

- గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో



- మాస్టర్ ప్లాన్ సిద్ధం చేసిన సిఆర్డిఏ అధికారులు
- మంత్రులు, హైకోర్టు భవనాలకు శంకుస్థాపన చేసే అవకాశం
- రూ. 40 వేల కోట్లతో పనులు ప్రారంభం
- తాజాగా ఢిల్లీకి వెళ్లిన సీఎం చంద్రబాబు

మోడీని ఏపీకి ఆహ్వానించనున్నారు. ఆయన రాకను బట్టి.. పనులకు ముహూర్తం పెట్టనున్నట్టు తెలిసింది. ఏపీ రాజధాని అమరావతిలో పనులు ప్రారంభం కానున్నాయి. దాదాపు ఈ దఫా 40 వేల కోట్ల సొమ్ములతో పనులు ప్రారంభించేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయించుకుంది. దీనిలో ప్రధానంగా మంత్రులు, న్యా యమూర్తుల నివాసాలు, మౌలిక సదుపాయాలు, హైకోర్టు నిర్మాణం వంటివి ఉన్నాయి. దీనికి సంబంధించి ఇప్పటికే టెండర్లు కూడా పిలిచారు. వీటిని ఒకటి రెండు రోజుల్లో ఖరారు చేయనున్నారు. వాస్తవానికి ఈ నెల 12, 13 తేదీల్లోనే పనులు ప్రారంభించాలని అనుకున్నారు. ఆ వెంటనే పనులు కూడా మొదలవుతాయని గతంలో సీఎం చంద్రబాబు, మంత్రి నారాయణలు వెల్లడించారు. అయితే.. ఈ పనులు ఇంకా ప్రారంభం కాలేదు. దీనికి కారణం.. పునః ప్రారంభ పనులను ప్రధాని నరేంద్ర మోడీతో ప్రారంభించాలని సీఎం చంద్రబాబు సంకల్పించారు. ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు(ఏడీబీ) నుంచి 30 వేల కోట్ల వరకు అప్పులు ఇస్తున్న నేపథ్యంలో మోడీకి పెద్దపీట వేయాలని నిర్ణయించుకున్నారు. ఈ నేపథ్యంలోనే టెండర్లను కూడా ఖరారు చేయకుండా ఉంచారన్న చర్చ ఉంది. తాజాగా ఢిల్లీకి వెళ్లిన సీఎం చంద్రబాబు మోడీని

మిగతా 3వ పేజీలో



## జనాలను చూసుకుని మురిసి పోవడమేనా ?

సభలకు జనం వస్తే ఓట్లు వేస్తారా? వచ్చిన జనమంతా ఓట్లు వేస్తే ఎవరికి మేలు జరుగుతుంది? కేవలం జన సందోహం అనేది అభిమానం మీద, ఆత్రుతతో చూడటానికి వస్తారనే విషయాన్ని అది నాయకులు గ్రహించాలి. తమ అధినేతను చూసేందుకు దారి పొడవు జనం కుప్పలు తెప్పలుగా రావడం చూసి వైకాపా నేతలు తెగ పొంగి పోతున్నారు. వారు వాస్తవ పరిస్థితిని గమనిస్తే మరోలా ఉంటుందనే విషయం. గ్రహించాలి. అన్న వస్తే చాలు జన సందోహమే అని వైకాపా నేతలు పొంగిపోతున్నారు. జగన్‌కు జనాదరణ ఏమాత్రం తగ్గలేదని వైకాపా నేతలు తెగ మురిసిపోతున్నారు. జగన్ ను చూసేందుకు జనం వస్తున్నారు... ఆయన వెంట పరుగులు తీస్తున్నారు.. ఇది వాస్తవమే అయినా వారంతా ఓటర్లుగా మారి ఆ పార్టీకి ఓటు వేస్తారని గ్యారెంటీ ఏమైనా ఉందా? అనే విషయాన్ని వైకాపా నేతలు గమనించాలి.. ఇటీవల తెనాలిలో వైకాపా లేదా ఇంట్లో జరిగిన ఒక ప్రైవేటు ఫంక్షన్ కి జగన్ హాజరయ్యారు. వచ్చిన జనాలను చూసి వైకాపా నేతలు తెగ చెప్పుకుంటున్నారు...

- గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో

- జనం ఓట్లు రాల్చేనా
- జనం నీరాజనం
- ఆనందంతో పొంగిపోతున్న వైకాపా నేతలు

అన్న వస్తే చాలు జన సందోహమే అని వారు హుషారు చేస్తున్నారు. వైసీపీ అధినేత తాజాగా తెనాలికి వచ్చారు. తమ పార్టీకి చెందిన ఒక నాయకుడి ఇంట్లో ఫంక్షన్ కి ఆయన రావడం జరిగింది.

మిగతా 3వ పేజీలో

## వైసీపీ అనమ్మతినేతలకు జగన్ షాక్

- పార్టీ ఇన్‌చార్జిగా బొల్లాను తొలగించాలని డిమాండ్
- అధిష్టానానికి ఇటీవల ఫిర్యాదులు ఇటీవల జగన్, బొల్లా బ్రహ్మనాయుడు భేటీ
- "బొల్లా" వైపే అధిష్టానం
- అనమ్మతి నేతలను సస్పెండ్ చేసినట్లు ప్రకటించిన వైసీపీ

వినుకొండ మేజర్ న్యూస్ : రాజకీయాల్లో గెలుపు ఓటములు సహజం. ద్వితీయ శ్రేణి నేతలు, నేతల ముఖ్య అనుచరులు తమ నేత గెలిస్తే మా వల్లేగెలిచాడు అని చెప్పుకోవటం.. ఓడిపోతే ఒంటెద్దు పోకడ అని నిందలేసి పార్టీలు మారటం నిత్యం చూస్తూనే ఉన్నాము. రాష్ట్రంలో వైసీపీ 2024 శాసనసభ ఎన్నికల్లో ఘోరంగా ఓడిపోయిన తరువాత వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ని ఆత్మగా భావించే విజయసాయిరెడ్డి లాంటివారే పార్టీని వీడి "కోటరీ" వంటి నెపం జగన్పై వేశారు. ఇక ఇదే పరిస్థితి ఆయా నియోజకవర్గాల్లోనూ ఉంది. కొన్ని నియోజకవర్గాల్లో తమ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రమించినా ఓడిపోవటం బాధగా ఉందని, ఓడినా గెలిచినా మా నేత వెంటే ఉంటామని కొందరు ద్వితీయ

మిగతా 3వ పేజీలో



## పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చు



**ఈపూరు మేజర్ న్యూస్ :** క్రీడల్లో ముందుకు సాగాలంటే సాధననే ముఖ్యమని ధనలక్ష్మి వ్యాయామ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చుండు వెంకటరావు అన్నారు. మండలంలోని ముప్పాళ్ళ ధనలక్ష్మి వ్యాయామ కళాశాలకు చెందిన క్రీడాకారులు గుంటూరు సమీపంలోని చౌడవరం గ్రామం ఆర్ వి ఆర్ అండ్ జెసి ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 18 మరియు 19వ తేదీల్లో జరిగిన అంతర్ కళాశాలల సాఫ్ట్బాల్ పోటీలలో పాల్గొని ప్రథమ స్థానం సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చుండు వెంకటరావు గురువారం తెలిపారు. సాఫ్ట్ బాల్ పోటీలలో మొత్తం తొమ్మిది జట్లు పాల్గొనగా 9 జట్లలో మంచి ప్రతిభ కనబరిచి తమ కళాశాల విద్యార్థులు విజేతలుగా నిలిచారని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నతనం నుంచే క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని,పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చునని,క్రీడా పోటీల్లో ప్రతి ఒక్కరూ గెలుపు ఓటములను పట్టించుకోకుండా క్రీడా స్ఫూర్తిని చాటాలన్నారు.క్రీడల వల్ల శారీరకంగా మానసికంగా యువత దృఢంగా తయారవుతారని,క్రీడలు మానసిక ఉల్లాసానికి పెంపొందించడమే కాక మనిషికి, మనిషికి మధ్య ప్రేమానురాగాలు పెంచుతాయన్నారు. అనంతరం ప్రథమ స్థానం సాధించిన తమ కళాశాల క్రీడాకారులను కళాశాల సెక్రటరీ మరియు కరస్పాండెంట్ మేదరమెట్ల రామ శేషగిరిరావు అధ్యాపకులు ఆర్. బలరాం నాయక్, సిహెచ్.అరవింద్, ఎం. దాసు, కే.వంశీ చైతన్యలు అభినందించారు.

## రైలు కింద పడి యువకుడు మృతి



**పెదకాకాని, మేజర్ న్యూస్ :** పెదకాకాని రైలు కిందపడి యువకుడు మృతి చెందిన సంఘటన గురువారం మండల కేంద్రమైన పెదకాకానిలోని అండర్ బ్రిడ్జి సమీపంలో జరిగింది. గుర్తుతెలియని మృదేహం రైల్వే ట్రాక్ మీద పడి ఉండటంతో స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. అది పెదకాకాని సుందరయ్య కాలానికి చెందిన పంది గోపికృష్ణ (32) గా పోలీసులు గుర్తించారు. పోలీసులు మృదేహాన్ని స్వాధీనం చేసుకుని విచారణ జరుపుతున్నారు.

## ఎస్సీ వర్గీకరణ అభినందనీయం



**తెనాలి, మేజర్ న్యూస్ :** ఎస్సీ వర్గీకరణ ద్వారా మాదిగ, మాదిగ ఉపకులాల చిరకాల వాంఛ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నెరవేర్చడం అభినందనీయమని టిడిపి జిల్లా ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షులు సౌపాటి కిరణ్ పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణకు చిత్తశుద్ధితో పని చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి స్థానిక చెంచుపేట ఇందిరాకాలనీలో గురువారం పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ ఉమ్మడి రిజర్వేషన్ కారణంగా మాదిగ, మాదిగ ఉపకులాలు అన్ని రంగాల్లో వెనుకపడిపోయారని అన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో సుదీర్ఘ పోరాట ఫలితంగా వర్గీకరణ ఫలాలు అందాయన్నారు. ఉద్యమం ద్వారా పోరాడిన మంద కృష్ణ తో పాటు ప్రతి నాయకుడు, కార్యకర్తలు ఈ విజయం అంకితమన్నారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ధనరాజుపల్లి కిషోర్ మాట్లాడుతూ 30 ఏళ్ల సుదీర్ఘ పోరాటంలో వేలాది మంది త్యాగం చేశారని అన్నారు. మంద కృష్ణ మాదిగ పోరాట ఫలితంగా మాదిగ, మారుగా ఉపకులాల జీవితాల్లో వెలుగులు నిండాయన్నారు. వర్గీకరణకు చిత్తశుద్ధితో కృషిచేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు కు మాదిగ జాతి పక్షాన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు చిలకా కిరణ్, టీడీపీ నాయకులు బొబ్బిళ్లపాటి ప్రసాద్, గాజులవర్తి సురేష్, కొక్కిలిగడ్డ మనోజ్, తంగిరాల మనోజ్, బాల నాగమ్మ, అత్తోట ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# దుగ్గిరాల మండలంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ





**దుగ్గిరాల, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని ఈమని, పెదకొండూరు, పెదపాలెం శృంగారపురం గ్రామాల్లోని పలువురు బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను కూటమి నాయకులు గురువారం లబ్ధిదారుల ఇంటికి వెళ్లి అందజేశారు. నిరుపేద కుటుంబాలకు కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని అందించి పేద ప్రజలకు కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడు అండగా ఉంటుందని తెలుగుదేశం మండల పార్టీ అధ్యక్షురాలు కేసం.నేని శ్రీ అనిత, పెదపాలెం. గ్రామ సర్పంచ్ పాటిబండ్ల కృష్ణ ప్రసాద్, ఎంపీటీసీ . పుతు 0 బాక సాయి కృష్ణ ,విశ్వనాథపల్లి శివకుమార్, పసుపులేటి శ్రీనివాసరావు. కే.సం నేని వాసు బాబు లు అన్నారు. ఈమని గ్రామానికి చెందిన చెన్నంశెట్టి వెంకటేశ్వరరావు కులక్ష రూపాయలు, పెద కొండూరు గ్రామానికి చెందిన మల్లెల ఆ ది య్య 60, 437 రూపాయలు, వెలివెల రామాంజనేయులుకు 37,560 చెక్కును, బిక్క.సాని సింధుకు 50 వేల 497 రూపాయలు చెక్కును, పెదపాలెం గ్రామానికి చెందిన మరీదు వసంత కుమారికి 31,843 రూపాయలు చెక్కును శృంగారపురం గ్రామానికి చెందిన రాచారి పాపకు 24 వేల రూపాయల చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో దుగ్గిరాల మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ కొండూరు ముత్తయ్య, అంచే మారుతి వరప్రసాద్, కాబోతు దేవదాసు, అంకమయ్య, కె.కృష్ణ, అంచే రవి చంద్, కె భుజంగరావు, సిహెచ్. ఏసు పాదము, ఎన్ . గోవర్ధన్, ఎన్. విజయబాబు, డి.ఎస్.రాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం



**దుగ్గిరాల, మేజర్ న్యూస్ :** దుగ్గిరాల మండలంలో ప్రకృతి వ్యవసాయ ఖరీఫ్ కార్యాచరణ మరియు పిఎండిఎస్ పై మండల స్థాయి అవగాహన మరియు సమన్వయ సమావేశం గురువారం దుగ్గిరాల మండల పరిషత్ కార్యాలయంలో జరిగింది. కార్యక్రమానికి మండల వ్యవసాయ అధికారి పి .శిరీష, జిల్లా. వనరుల కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ సునీత, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రాజకుమారి పాల్గొన్నారు. సమావేశంలో జిల్లా కోఆర్డినేటర్ సునీత మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం వల్ల భూమిలో జరుగుతున్న మార్పులను వివరించారు. జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రాజకుమారి మాట్లాడుతూ ప్రతి రైతుకు ప్రకృతి వ్యవసాయం దగ్గర అవ్వాలని పిఎండిఎస్ ఉపయోగాలు, ప్రతి రైతు తెలుసుకోవాలని అన్నారు. ఖరీఫ్ ప్రణాళిక మరియు పిఎండిఎస్ కార్యక్రమం ప్రాముఖ్యత, వ్యవసాయ శాఖ డిఆర్డిఏ సిబ్బంది సహాయ సహకారాలు ఈ కార్యక్రమంలో చాలా అవసరమని వివరించారు. సమావేశంలో గోపీచంద్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో ఖరీఫ్ ప్రణాళిక పిఎండిఎస్ యొక్క ఆవశ్యకత మరియు గ్రామ మండల స్థాయి సిబ్బంది యొక్క బాధ్యతలను గురించి వివరించారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది ఏఈఓ, వివిఎ , ఏపీఎం, సిసి, వివోఏలు, ఎంఎస్ఓ.బి లు తోపాటు ఆరు గ్రామాల నుండి ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

# పాస్టర్లకు గుడ్‌న్యూస్.. గౌరవ వేతనాల చెల్లింపునకు నిధుల విడుదల



**పిడుగురాళ్ల, మేజర్ న్యూస్ :** రాష్ట్రంలో క్రైస్తవ పాస్టర్లకు గౌరవ వేతనాల చెల్లింపు కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.12.82 కోట్లు విడుదల చేసిందని రాష్ట్ర న్యాయ,మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. గురువారం ఈ మేరకు అమరావతిలో ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని 8,427 మంది పాస్టర్లకు నెలకు ఒక్కొక్కరికి రూ. 5,000 ప్రకారం గౌరవ వేతనం ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. గత ఏడాది మే నెల నుంచి పాస్టర్లకు గౌరవ వేతనం చెల్లింపుకు ప్రభుత్వం నిధులు విడుదల చేసిందని తెలిపారు. ఇప్పటికే గత నెలలో రాష్ట్రంలోని ఇమాములు, మౌజాన్లకు 6నెలల గౌరవ వేతనం చెల్లింపు ప్రక్రియ ను పూర్తి చేసి రూ. 45 కోట్లు చెల్లించిన విష యం తెలిసిందేనని పేర్కొన్నారు. మైనార్టీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గత ప్రభుత్వం మైనార్టీల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించడం జరిగిందని మంత్రి విమర్శించారు. మైనారిటీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే ఒదుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికాబద్ధమైన చర్యలను అమలు చేస్తున్నదని మంత్రి ఫరూక్ పేర్కొన్నారు.

# మాచవరం ఇఫ్తార్ విందులో పాల్గొన్న డాక్టర్ అశోక్ కుమార్





**మాచవరం మేజర్ న్యూస్ :** మాచవరంలో నిర్వహించిన ముస్లిం సోదరులు వైసీపీ మైనార్టీ యూత్ మండల నాయకులు షేక్ మాబు వలి ఆధ్వర్యంలో గురువారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైసిపి రాష్ట్ర వైద్యుల అధికార ప్రతినిధి, గురజాల నియోజకవర్గం సీనియర్ వైసీపీ నాయకులు డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్ హాజరయ్యారు. ముందుగా మసీదులో ముస్లిం సోదరుల ప్రార్థనలో పాల్గొన్నారు. అనంతరం మైనార్టీ నాయకులు షేక్ మాబు వలి ఇంటి వద్ద ఏర్పాటుచేసిన ఇఫ్తార్ ఇందులో పాల్గొని భోజనం వడ్డిచ్చి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, మాజీ సైనికులు రాగిడి నరేష్, మాచవరం సొసైటీ మాజీ అధ్యక్షులు అంబటి కోటయ్య, షేక్ పెద మాబు, చింతపల్లి రఫీ , బుడే సాహెబ్, పుసులూరి శ్రీను, మహేంద్ర, అనిల్, నవీన్, రాగిడి ప్రకాష్ మహేష్, రాజేష్, దయానందం పలువురు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

# వైసీపీ అసమ్మతినేతలకు జగన్ షాక్

(మొదటి పేజీ తరువాయి)

శ్రేణి నాయకులు అండగా నిలుస్తుండగా మరికొన్ని చోట్ల అధికారపక్షం ఒత్తిడి, ప్రలోభాలకు లోనై పార్టీలు కూడా మారుతున్నారు. ఈ క్రమంలో వినుకొండ నియోజకవర్గ వైసీపీలో మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుని వ్యతిరేకిస్తూ కొందరు సీనియర్ నాయకులు రహస్య సమావేశాలు నిర్వహించుకొని అధిష్టానానికి ఫిర్యాదులు చేశారు. బొల్లా బ్రహ్మనాయుడుని వెంటనే నియోజకవర్గ ఇన్చార్జిగా తొలగించాలని లేదంటే తాము పార్టీని వీడేందుకు సిద్ధమని కూడా అల్టిమేటం జారీ చేశారు. తొలుత పార్టీ ముఖ్య నేత సజ్జల రామకృష్ణారెడ్డిని కలిసిన అసమ్మతి వర్గం తదుపరి వైసీపీ సుబ్బారెడ్డిని కూడా కలిసి తమ అసమ్మతిరాగం వినిపించారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్తో మాట్లాడి తగు నిర్ణయం తీసుకుంటామని వైవీ తేల్చి చెప్పటంతో అసమ్మతి వర్గం నియోజకవర్గంలో మరింత దూకుడు పెంచింది. ఓ దశలో అసమ్మతి వర్గంలో ముఖ్యనేత, పార్టీ సీనియర్ నాయకుడు చుండూరి వెంకటేశ్వర్లును ఇన్చార్జిగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. అంతటి ఆగకుండా అసమ్మతి వర్గం వేరుగా పలు కార్యక్రమాల్లో పాల్గొంటూ వస్తోంది. ఇటీవల పార్టీ అవిర్భావ దినోత్సవ వేడుకలను కూడా అసమ్మతి వర్గం నిర్వహించటం, అన్నదానం చేయటం వంటివి జరిగాయి. ఓ వైపు బొల్లా బ్రహ్మనాయుడు కూడా పార్టీ కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. అసమ్మతి వర్గం ఫిర్యాదు నేపథ్యంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సూచన మేరకు

మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్. జగన్ ను కలిశారు. ఇరువురి మధ్య 20 నిముషాల పాటు చర్చ జరిగింది. ఈ సందర్భంగా బొల్లా బ్రహ్మనాయుడు పార్టీ పట్ల పూర్తి విధేయతను ప్రకటించటంతోపాటు పార్టీ బలోపేతానికి కట్టుబడి ఉన్నానని తేల్చి చెప్పారు. బొల్లా బ్రహ్మనాయుడు పట్ల జగన్ కూడా సానుకూలత వ్యక్తం చేశారు. గెలుపు ఓటములు సహజం అన్నా... చిన్న చిన్న సమస్యలు వస్తుంటాయి... వాటిని సర్దుకొని పో... మన వాళ్ళతో మాట్లాడు... అందరూ కలిసి

పనిచేసుకుంటూ వెళ్ళండి మళ్లీ మంచిరోజులొస్తాయి అని జగన్ ఆదేశించారు. దీంతో వై.ఎస్. జగన్ ఆదేశాలతో అసమ్మతి వర్గంతో మాట్లాడేందుకు ప్రయత్నించిన బొల్లాకు వారి నుంచి సానుకూల స్పందన రాలేదు. పోటీగా కార్యక్రమాలు నిర్వహిస్తున్న విషయాన్ని బొల్లా అధిష్టానం పెద్దలకు విన్నవించటంతో తాజాగా పార్టీ రాష్ట్ర కార్యాలయం నుండి వినుకొండ నియోజకవర్గంలో బొల్లాకు వ్యతిరేఖంగా గళం వినిపిస్తున్న అసమ్మతి వర్గ ముఖ్య నాయకులను పార్టీ నుండి సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించింది. దీంతో అసమ్మతి వర్గం ఒక్కసారిగా షాక్కు గురైంది.

**"బొల్లా నాయకత్వంలోనే...**

బొల్లా బ్రహ్మనాయుడుకు సొంత పార్టీలో అసమ్మతి కొత్తేమీ కాదు. రెడ్డి సామాజికవర్గానికి చెంది నాయకులు వీలుదొరికినప్పుడు అధిష్టానానికి ఫిర్యాదు చేస్తూ వస్తుంటారు. తమను పట్టించుకోవటం లేదని, బొల్లా మొండివైఖరితో వెళుతున్నారని ఆయనపై ఫిర్యాదులు చేయటం అధిష్టానం సర్దిచెప్పటం అలవాటే. మొన్నటి ఎన్నికలకు ముందు కూడా అసమ్మతి వర్గం బొల్లాకు సీటు ఇవ్వవద్దని అధిష్టానానికి సూచించింది. అయితే బొల్లా పట్ల ఉన్న నమ్మకం, బొల్లాకు పార్టీపై ఉన్న కమిట్మెంట్ నేపథ్యంలో సీటు ఆయనకే ప్రకటించింది. ఓటమి అనంతరం తమ పంతం నెరవేర్చుకునేందుకు నూజండ్ల, వినుకొండ మండలల్లో రెడ్డి సామాజికవర్గానికి చెందిన కొందరు నాయకుల తోపాటు శావల్యాపురం మండల కారుమంచి గ్రామానికి చెందిన నియోజకవర్గ సీనియర్ నాయకుడు చుందూరి వెంకటేశ్వర్లుని కూడా కలుపుకొని వెళ్ళటం గమనార్హం. చుండూరి

వెంకటేశ్వర్లు నాలుగు దశాబ్దాల రాజకీయ అనుభవం ఉన్న నేత. ఆర్థిక బలం లేని కారణంగా ద్వితీయ శ్రేణినేతగానే ఉండిపోయారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న క్రమంలోనూ. గతంలో వైసీపీ నుండి కూడా ఆయన టిక్కెట్ ఆశించి భంగపడ్డారు. అయినప్పటికీ వైసీపీలోనూ సీనియర్ నాయకుడిగా కొనసాగుతున్నారు. వైసీపీ అధికారంలో ఉండగా

ఎంపీటీసీగా పోటీచేసి ఓటమిపాలైనప్పటికీ బొల్లా బ్రహ్మనాయుడు ఈపూరు మార్కెట్ యార్డు ఛైర్మన్ పదవిని కట్టబెట్టి గౌరవించారు. ఇక అసమ్మతి వర్గంలో మరో ముఖ్య నాయకుడు నక్కా నాగిరెడ్డి. పార్టీలో కీలక ంగా ఉన్నారు. ప్రజల్లో సౌమ్యుడిగా, నిజాయితీ పరుడిగా పేరుంది. పార్టీ విధేయుడు కూడా. వీరితో పాటు వైసీపీ అధికారంలో ఉండగా బొల్లా భజన చేసి పదవులు పొంది, పనులు చేయించుకున్న నాయకులు బొల్లా నాయకత్వాన్ని వ్యతిరేఖించటం గమనార్హం.

**అసమ్మతి వర్గానికి చెక్పెట్టిన బొల్లా...**

నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి పనులు చేసినా, ఎంతో శ్రమించినా ఓటమిపాలవటం పట్ల దిగ్భ్రాంతి చెందిన బొల్లా బ్రహ్మనాయుడు నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాలను

క్రమంగా వేగవంతం చేశారు. కూటమి ప్రభుత్వం వైసీపీ నాయకులు, కార్యకర్తలపై పెడుతున్న అక్రమ కేసులు, దాడులుపై బొల్లా పార్టీ శ్రేణులకు అండగా నిలిచారు. ఈక్రమంలో తనను వ్యతిరేఖిస్తూ వచ్చిన వర్గంతోనూ బొల్లా బ్రహ్మనాయుడు విభేదాలు కోరుకోలేదు. జరిగిపోయిందేదో జరిగిపోయింది...

**అందరం కలిసి పనిచేద్దాం రండి**

అని చెప్పినా అసమ్మతి నేతలు వినకపోయినా. వారిపై నోరు జారలేదు. విలేకరులు ప్రశ్నించినా మా కుటుంబంలో చిన్న చిన్న మనస్పర్ధలు ఉన్నాయి... అవి త్వరలోనే సర్దు కుంటాయి అంటూ అసమ్మతిని లైట్ తీసుకున్నారు బొల్లా. ఎంత ప్రయత్నించినా అసమ్మతి నేతలు మొండి పట్టు వీడకపోవటంతో పాటు, వేరు వేరుగా కార్యక్రమాలు నిర్వహిస్తూ పార్టీ లైన్ దాటి, పార్టీకి నష్టం చేకూర్చేలా వ్యవహరిస్తున్న నాయకులను ఇక ఉపేక్షిస్తే లాభంలేదని భావించి అధిష్ఠానం ద్వారా అసమ్మతికి "చెక్"పెట్టారు.

**అసమ్మతివర్గం దారెటు...**

బొల్లా నాయకత్వం మాకొద్దు అంటూ నినదించిన నాయకులు కొందరు అధిష్టానం సూచనలతో మెత్తబడగా మరికొందరు నేతలు వెనక్కు తగ్గలేదు. దీంతో పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతున్నందున చుండూరు వెంకటేశర్లు, శాఖమూరి బుచ్చయ్య చౌదరి, నక్కా నాగిరెడ్డిలను సస్పెండ్ చేస్తూ వైసీపీ కేంద్ర పార్టీ కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. అధిష్టానం నిర్ణయంతో సస్పెండ్ అయిన నాయకుల రాజకీయ భవిష్యత్ ప్రశ్నార్ధకంగా మారింది. వైసీపీ వాదులుగా ముద్ర పడ్డ ఈ ముగ్గురు నేతలు ఇప్పుడు సొంత పార్టీకి దూరం కావాల్సి వచ్చింది. ఇక వారు రాజకీయంగా ఎలాంటి నిర్ణయం తీసుకుంటారు అన్నది చర్చనీయాంశంగా మారింది. వీరితోపాటు గతంలో పదవులు పొంది, వీరి వెనుక ఉండి బొల్లాపై అసమ్మతి వినిపించిన కొందరు నాయకులు, ప్రజాప్రతినిధులు మెల్లగా బొల్లాకు క్షమాపణలు చెప్పి మళ్లీ ఆయనకు జైకొట్టినట్లు తెలిసింది. కాగా సస్పెండ్ అయిన నాయకులు తెలుగుదేశంపార్టీలో చేరతారా? లేక జనసేన, బీజేపీ పార్టీల్లో చేరతారా? అన్నది తెలియాల్సి ఉంది.

# జనాలను చూసుకుని మురిసి పోవడమేనా ?

(మొదటి పేజీ తరువాయి)

అయితే దారి పొడవునా జనాలు జగన్కి నీరాజనాలు పట్టారు. దాంతో వైసీపీ శ్రేణులు ఉప్పొంగుతున్నాయి. అన్న వస్తే చాలు జన సందోహమే అని వారు హుషారు చేస్తున్నారు. జగన్ కి ఆదరణ ఎక్కడా తగ్గలేదని కూడా వైసీపీ అనుకూల మీడియాలో ప్రచారం సాగుతోంది. నిజమే జగన్ బయటకు వస్తే జనాలు ఆయనను చూసేందుకు ఉత్సాహం చూపిస్తున్నారు. జగన్ వెంట పరుగులు తీస్తున్నారు. జగన్ కి జేజేలు పలుకుతున్నారు. జగన్ తో చేతులు కలిపి కరచాలనం చేయడానికి కూడా ఉరుకులు పెడుతున్నారు. అయితే జగన్ కి ఈ ఆదరణ కొత్తదా ఏమైనా అన్న చర్చ కూడా ఉంది. జగన్ అంటే అభిమానం ఎపుడూ ఉంది. ఆయన చుట్టూ జనాలు ర్యాలీ కావడం అన్నది ఆయన రాజకీయాల్లోకి వచ్చిన దగ్గర నుంచి జరుగుతూనే ఉంది. జగన్ అంటే జనం అన్నట్లుగా ఆయన పాదయాత్ర సాగింది. అలాగే 2024 ఎన్నికల ముందు జగన్ సిద్ధం సభలు పెడితే జనాలు పోటెత్తారు. సిద్ధం సభలను చూసిన వారు అంతా వైసీపీయే రెండోసారి అధికారంలోకి వస్తుందని కూడా అంచనా వేశారు. జగన్ బస్సు యాత్ర చేస్తే దాని వెంట జనాలు పరుగులు తీయడాన్ని అంతా చూశారు. కానీ ఫలితం తేడా కొట్టింది. అలా ఇలా కాదు ఏకంగా 11 సీట్లకే వైసీపీకి పరిమితం చేసి ఘోరమైన రాజకీయ అవమానాన్ని మిగిల్చింది. దాంతోనే కదా వైసీపీకి నడ్డి విరిగినంత పని అయి చతికిలపడిపోయింది. తిరిగి లేచేందుకు కనీస ప్రయత్నం చేస్తున్నా శక్తి చాలడం లేదని అంటున్నారు. ఇదిలా ఉంటే జనాలు రావడం అన్నది రాజకీయ పార్టీల విజయానికి కొలమానం కానే కాదు అన్నది చరిత్ర నిరూపించింది. ఇప్పటికి మూడు దశాబ్దాల క్రితం టీడీపీ రెండుగా చీలిపోయింది. బాబు టీడీపీ లక్ష్మీపార్వతి టీడీపీ అంటూ వేరు పడ్డాయి. 1996లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో లక్ష్మీపార్వతి ప్రచారానికి వస్తే జనాలు ఎక్కడ చూసినా విరగబడ్డారు. కానీ ఆమె పార్టీ ఒక్క సీటూ గెలుచుకోలేదు. ఇక సినీ నటులు కొంతమంది పార్టీ పెట్టి జనంలోకి వచ్చినపుడు వారికి వచ్చిన జనాలు వేరే ఎవరికీ రాలేదు. కానీ విజయం మాత్రం వారికి అందకుండా పోయింది. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో ఉన్నాయి. అందువల్ల జనాలను చూసి మురిసిపోతే ఇబ్బంది అవుతుంది అని అంటున్నారు. వైసీపీ మళ్ళీ 2029 ఎన్నికల్లో గెలిచి తీరాలీ అంటే దానికి చేయాల్సింది పార్టీని టాప్ టూ బాటం పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేయాల్సి ఉంది. పనిచేసిన వారికి పదవులు ఇవ్వాలి. కోటరీ మాటలు వినకుండా జగన్ స్వయంగా ఎవరు ఏమిటి అన్నది చూసుకుని మరీ లెక్క వేసుకుని పార్టీ పదవులు అప్పగించాలి. అధినాయకత్వం జనాలకు చేరువగా ఉండాలి. అదే సమయంలో పార్టీ జనాలకు కూడా చేరువ కావాలి. నాయకుడి దగ్గరకు వెళ్ళి ఏమైనా చెప్పుకోవచ్చు అన్న ధీమా క్యాడర్ లో కలగాలి. అంతే కాదు అయిదేళ్ళ ప్రభుత్వ పాలనలో వైసీపీ ఏ ఏ తప్పులు చేసింది అన్నది పూర్తి స్థాయిలో ఆత్మ పరిశీలన చేసుకోవాలి. ఏ ప్రభుత్వంలో అయినా అన్నీ మంచే ఉండవు. జనాలకు నచ్చనివి ఉంటాయి. అలాంటి వాటిని పట్టుకుని మనస్ఫూర్తిగా తప్పులను దిద్దుకోవాల్సి ఉంది. ఇక వైసీపీ ని వీడిన వర్గాలను కానీ ఆ పార్టీ విధానాల పట్ల ఇబ్బంది పడి దూరం అయిన వారిని కానీ చేరువ చేసుకోవాలి. ఇలా ఎన్నో రిపేర్లు చేసుకుంటే తప్ప ఏపీలో ఫ్యాన్ గిర్రున తిరిగే అవకాశాలు ఉండవని అంటున్నారు. అయితే జగన్ కి జనాలు వచ్చారు. ఆయన ప్రజాదరణకు తిరుగులేదు అని భావించి వందిమాగధులు ఎవరైనా ధీమాకు పోయి అవే నిజమని అధినాయకత్వానికి చెప్పినా కోటరీ మాటలు విని అధినేత కోటలో కూర్చున్నా కూడా వైసీపీకి షాకులు తప్పవని అంటున్నారు. సో అదన్న మాట మ్యాటర్. ఇక వైసీపీ అలెర్ట్ కావడమే కీలకం.

## సమాచార హక్కు చట్టం 2005పై అవగాహన సదస్సు



**పెదకాకాని మేజర్ న్యూస్ :** పెదకాకాని, గొల్లమూడి గ్రామాలలో గురువారం మండల వ్యవసాయ అధికారి పి.సంధ్యారాణి ఆధ్వర్యంలో సమాచార హక్కు చట్టం 2005 పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పౌర సరఫరాల అధికారికి దరఖాస్తు అందించిన 30 రోజులలో కోరిన సమాచారాన్ని అధికారులు అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## అమరావతికి మళ్లీ ప్రధానే ..!

(మొదటి పేజీ తరువాయి)

ఏపీకి ఆహ్వానించనున్నారు. ఆయన రాకను బట్టి.. పనులకు ముహూర్తం పెట్టనున్నట్టు తెలిసింది. మరోవైపు... మోడీ రాకపై పార్టీలోనే భిన్నాభిప్రాయాలు వ్యక్తమ వుతున్నాయి. గతంలో రాజధానిని కూడా ఆయన చేత్తోనే ప్రారంభించారని, అప్పట్లో నిర్మాణాన్ని వైసీపీ ప్రభుత్వం అటక ఎక్కించినా.. ఆయన ఏమీ స్పందించలేదని, కనీసం పదేళ్లలో రాజధాని గురించి కేం ద్రం స్థాయిలో రివ్యూ కూడా చేయలేదని.. ఇప్పుడు ఆయనను ఎందుకు పిలుస్తున్నారన్నది సీనియర్ల వాదన. 'డ్రమ్ములో నాన్న ఉన్నాడు'.. హత్య కేసులో ఆరేళ్ల కూతురి మాటలు నిజం! కానీ, చంద్రబాబు ఆలోచన మరో విధంగా ఉందని సీనియర్లు చెబుతున్నారు. గతంలో ఉన్న బాండింగ్ వేరు.. ప్రస్తుతం కేంద్రంలోని ఎన్డీయే సర్కారుకు టీడీపీ కీలకంగా మారిందని. ఈ నేపథ్యంలో ఇప్పుడు న్న బాండింగ్ వేరని వారు చెబుతున్నారు. పైగా.. ఇప్పుడు కేంద్రాన్ని మచ్చిక చేసుకోవడం ద్వారా అమరావ తిని ఈ దఫా పాలనలోనే పూర్తి చేసుకునే అవకాశం ఉంటుందని వారు చెబుతున్నారు. కొన్ని కొన్ని ఇబ్బందులు వచ్చినా.. మోడీని పిలవడమే బెటర్ అని వారు చెబుతున్నారు. మొత్తానికి త్వరలోనే అమరావతిలో మోడీ మరోసారి పునః ప్రారంభ కార్యక్రమాలకు పూజలు, శంకుస్థాపనలు చేయనున్నట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం.

## సీఎం చంద్రబాబు చిత్ర పటానికి పాలాభిషేకం చేసిన డొక్కా మాణిక్య వరప్రసాద్



**గుంటూరు మేజర్ న్యూస్ :** ఎస్సీ వర్గీకరణ బిల్లు అసెంబ్లీలో ప్రవేశపెట్టి, వర్గీకరణను చట్టం చేసే ప్రక్రియను వేగవంతం చేస్తున్నందుకు లాడ్జి సెంటర్ లోని భారత రాజ్యంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి రాష్ట్ర సీఎం చంద్రబాబు నాయుడు చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా డొక్కా మాణిక్య వర ప్రసాద్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కేబినెట్ తీర్మానాన్ని శాసన సభలో ఆమోదింబ చేయడం ఎస్సీ వర్గీకరణ పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయిడు చిత్తశుద్ధికి నిదర్శమని ప్రశంసించారు. రాష్ట్ర శాసన సభ తీర్మానాన్ని జాతీయ ఎస్సీ కమిషన్ కు నివేదించేందుకు సీనియర్ ఐఎఎస్ అధికారిని నియమించాలని కోరారు. 2000వ సంవత్సరంలో కూడా వర్గీకరణను చట్టం చేసి మాదిగలు వేలాది ఉద్యోగాలు పొందేందుకు కృషి చేశారన్నారు. అప్పుడు చంద్రబాబు చేసిన కృషి ఫలితంగానే నేడు దేశ వ్యాప్తంగా వర్గీకరణ అమలు జరిగేందుకు దోహదం చేస్తుందన్నారు. ఎంజెఎస్ఎస్ బాయకులు చావలి బాలస్వామి మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ చేయడం ద్వారా ఎస్సీ ఉప కులాలకు సామాజిక న్యాయం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మాదిగ జన సేవా సమితి నాయకులు అత్తోట జోసఫ్ కుమార్, కాకుమాను పున్నారావు, టొబాకో అప్పారావు, పరంగి సత్యరాజు, కట్టెపోగు ఉదయభాస్కర్, కొలకలూరి కోటేశ్వరరావు, పాటిబండ్ల బాలయ్య, బిజెపి పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్చార్జి దర్శనపు శ్రీనివాస్, జనసేన పార్టీ రాష్ట్ర నాయకులు పాలకాయల వెంకట్, చిలక నాగేశ్వరరావు, యూత్ కమిటీ సభ్యులు చిలువురు విజయ్, డొక్కా సురేష్, అంకాళ వెంకటేశ్వర్లు మరియువివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.


**బహిరంగ ప్రకటన**

ఈ దిగువ షెడ్యూలు ఆస్తిని నా క్లయింట్స్ అయిన బయ్యన వెంకట శ్రీనివాసరావు S/O జగన్నాధ్ధరావు సాతులూరు గ్రామం, పల్నాడు జిల్లా నివాసులు, శ్రీమతి అయినవోలు రవింద్ర భర్త అయినవోలు వెంకటేశ్వర్లు (లేటు) గుంటూరు, గుంటూరు జిల్లా అను వారికి వారి భర్త యొక్క విలునామా ద్వారా సంక్రమించినటువంటి ఆస్తిని కొనుగోలు చేయు నిమిత్తం సంప్రదించియున్నారు. ఈ షెడ్యూలు ఆస్తికి సంబంధించి ఎవరికైన ఎటువంటి అభ్యంతరములు ఉన్న యెడల ఈ దిగువ నెంబరుకు ది. 26-03-2025లోగ సంప్రదించవల సినది.

షెడ్యూలు

అయినవోలు వెంకటేశ్వర్లు గారి వీలునామా ద్వారా అయినవోలు రవింద్ర (వెంకటేశ్వర్లు గారి రెండవ భార్య) గారికి చెందినటువంటి ఆస్తికి వివరములు. డి.నెం. 334 పట్టా నెం. 553, జి.నెం. 310211రు పట్టాదారు పాస్ పుస్తకం గుంటూరు డి. నరసరావుపేట రి.డి. నరసరావుపేట సబ్.డి యిలాకా సాతులూరు గ్రామ పంచాయితీ ఏరియాలో చేరిన సాతులూరు గ్రామము తాలూకు డి.నెం. 334రు మింజుమలె అయినవోలు రవింద్ర గారికి హక్కు కలిగిన య. 2-00 సెంట్ల మగాణి భూమి హద్దులు.

తూర్పు : దన్నవరపు పేరయ్య వగైరాలు
పడమర : కాకర్ల యోగయ్య
ఉత్తరం : అయినవోలు శ్రీరంగం వారి కుమారులు
దక్షిణం : అయినవోలు గోపాలరావు వగైరాల భూమి

సంప్రదించవలసినది :

**యం.యం. షరీఫ్,** అడ్వకేట్,
నరసరావుపేట, సెల్ నెంబర్ **8978626315**

## పక్షుల చిత్రాలతో డ్రాయింగ్ పోటీలు




నూజెండ్ల మేజర్ న్యూస్ : ప్రపంచ పిచ్చుకల దినోత్సవ సందర్భంగా గురువారం మండలంలోని పెద్దవరం గ్రామంలో పాఠశాలలో విద్యార్థులు ఐ లవ్ స్పారో అని తెలియజేస్తూ ప్లకార్డులు ప్రదర్శించి ప్రపంచ పిచ్చుకల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. పక్షుల చిత్రాలతో డ్రాయింగ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. పాఠశాల హెచ్ఎం ఘంటా నాగేశ్వరరావు మాట్లాడుతూ పిచ్చుకలు అందమైన చిన్న చిన్న పక్షులని, మా చిన్నతనంలో పిచ్చుకలు మన ఇళ్లలోనే నివాసం ఉండేవని పిచ్చుకలు అంతరించిపోతున్న జాతిగా తయారైందని విద్యార్థులకు తెలియజేశారు. చిన్ననాటి నుండే పెరటిలో మొక్కలను పెంచటం, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించటం, వేసవిలో పక్షులకు నీరు అందుబాటులో ఉండేలా చూడటం లాంటి మంచి అలవాట్లు చేసుకోవాలని తద్వారా పక్షులు, పిచ్చుకల రక్షణలో భాగస్తులమవుదామని విద్యార్థులను కోరారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మిర్చి, ఇతర పంటల రైతులకు అండగా నిలవాలని శాసనసభ వేదికగా కోరిన

**గురజాల శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు**



పిడుగురాళ్ల మేజర్ న్యూస్ : నాగార్జునసాగర్ కుడికాల్వకు సంబంధించిన గురజాల నియోజకవర్గం లోని మేజర్, మైనర్ కాల్వలను వైసీపీ పాలనలో పట్టించుకునే వారే లేరు. కానీ మన ప్రభుత్వం ఏర్పడిన రెండు నెలల్లోనే ఆ కాల్వలన్నీటిని బాగుచేసి, వాటిని పూర్తిగా అందుబాటులోకి తీసుకొచ్చాం. అందువల్ల నాగార్జునసాగర్ కుడికాల్వ నుండి నీటి సరఫరాను మిర్చి రైతుల కోసమేకాక, వాణిజ్య పంటలు ఎక్కువగా ఉన్నందున ఏప్రిల్ నెలాఖరు వరకు పొడిగించాలని కోరుతున్నట్లు తెలిపారు.

## మున్సిపాలిటీల్లో స్వచ్ఛతపై సర్కార్ కీలక ఆదేశాలు



పిడుగురాళ్ల మేజర్ న్యూస్ : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి ఆదేశాలతో మున్సిపాలిటీల్లో స్వచ్ఛతపై ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్రంలోని మున్సిపల్ కమిషనర్లతో పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్ వీడియో కాన్ఫరెన్స్ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలం ప్రారంభానికి ముందే అన్ని డ్రెయిన్లలో సిల్ట్ తొలగించాలని సూచించారు. సిల్ట్ తొలగింపుపై ప్రతి వారం నివేదికలు పంపించాలని తెలిపారు. చెత్త డంపింగ్ సైట్లలో ఉన్న చెత్తను పూర్తిగా తొలగించి సీసీటీవీ కెమెరాల పర్యవేక్షణ ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. ఇక, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకంపై కఠినంగా వ్యవహరించాలని పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్ కమిషనర్లకు తెలిపారు. ప్రతి మున్సిపాలిటీలో ఖచ్చితంగా ఒక మోడల్ స్వర్ణాంధ్ర పార్క్ ఏర్పాటు చేయాలని చెప్పారు. పచ్చదనం, పార్కుల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. స్వచ్ఛ ఆంధ్రా ప్రచారాన్ని నిజమైన ప్రజల కార్యక్రమంగా రూపొందించాలి ఐఏఎస్ అధికారి సురేష్ వెల్లడించారు.

### కిమ్స్ శిఖర హాస్పిటల్ సంక్లిష్టమైన కరోనరీ ఇంటర్వెన్షనల్ విధానంలో

# రక్తనాళాల్లో అడ్డంకులు తొలగింపు

**శస్త్ర చికిత్సలు లేకుండా స్టంట్ల సాయంతోనే రోగికి చికిత్స**



గుంటూరు మేజర్ న్యూస్ : కిమ్స్ శిఖర హాస్పిటల్‌లో మూడు సంక్లిష్టమైన కొరనరీ ఇంటర్వెన్షనల్ ప్రొసీజర్లు విజయవంతంగా పూర్తి చేశారు. శస్త్రచికిత్స అవసరమైన కేసులు. ఈ హై-రిస్క్ కేసులు, ఈ కేసుల్లో చికిత్సకు కష్టంగా ఉండే కొరనరీ రక్తనాళాల్లో అవరోధాలను కలిగి ఉన్నవాటిని, ఆధునిక సాంకేతికతలు, అత్యుత్తమ పరికరాలతో ఇంటర్వెన్షనల్ కార్డియాలజీకి కొత్త ముద్రను వేసాయి. మొదటి కేసు రక్తనాళాల్లో అడ్డంకులు, ఇది కేవలం ముడతలు ఉన్నది కాకుండా, తీవ్రంగా కాల్సియఫైడ్ (కల్షియం పెరిగిన) కూడా ఉండటం వల్ల, చికిత్స చేయడం అత్యంత కష్టం అయింది. రెండవ కేసు తీవ్రంగా కాల్షియఫైడ్ (కల్షియం పెరిగిన) రక్తనాళంతో ఉన్నది. అబ్‌నార్మల్ (అసాధారణ) మూలం ఉన్నది.ఇది చికిత్సను మరింత కష్టతరం చేసింది. మూడవ కేసు బిఫర్కేషన్ రుగ్మతతో ఉంది, ఇది గతంలో ప్రయత్నించ బడినప్పటికీ సాంకేతిక సమస్యల వల్ల పూర్తి కాలేదు.రోగిని శస్త్రచికిత్స కోసం పంపించారు. అయితే, కిమ్స్ సిఖరాలో అందుబాటులో ఉన్న ఆధునిక పరికరాల సహాయంతో, మూడు కేసులూ విజయవంతంగా పూర్తి అయ్యాయి స్టెంట్లతో చికిత్సను గురువారం గుంటూరులోని కిమ్స్ శిఖర హాస్పిటల్ విజయవంతంగా నిర్వహించారు. ఇంటర్వెన్షనల్ ప్రొసీజర్లు ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ అజ్ఫర్ జమాన్ నేతృత్వంలో నిర్వహించారు, యూకే నుండి వచ్చిన కార్డియాలజిస్ట్, ఈ ఇంటర్వెన్షన్ల చికిత్సలో మార్గదర్శక త్వం అందించారు. ఇంట్రాకొరనరీ అల్ట్రాసౌండ్ (ఐవియు ఎస్), కొత్త కట్టింగ్ బలూన్లు, మైక్రో-క్యాథెటర్స్, డ్రగ్-ఎల్యూషన్ బలూన్ల సహాయంతో ఈ ఆధునిక పరికరాల ఉపయోగించి శస్త్రచికిత్స అవసరం లేకుండా సమర్థవంతమైన ఫలితాలను సాధించడానికి టీమ్‌కు సహాయం చేశాయి. డాక్టర్ పి నాగశ్రీ హరిత, కిమ్స్ సిఖరాలో కార్డియాక్ సైన్సెస్ డైరెక్టర్ ఆధ్వర్యంలో డాక్టర్ శివప్రసాద్, కాథ్‌ల్యాబ్ డైరెక్టర్ లు విజయవంతం గా చికిత్సలను పూర్తి చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ హరిత మాట్లాడుతూ "మునుపటి రోజుల్లో, ఇలాంటి సమస్యలకు శస్త్రచికిత్స కోసం పంపించాల్సిన అవసరం ఉండేదని. కానీ కొత్త సాంకేతికతలు, పద్ధతుల ఉనికితో, ఇప్పుడు మేము అత్యంత తక్కువ ఆపరేషన్ అవసరం కలిగిన చికిత్సలను అందించగలుగుతున్నా ము. ఇది రోగుల కోలుకునే సమయాన్ని, ప్రమాదాన్ని తగ్గిస్తుందని తెలిపారు. ఇలాంటి అరుదైన శాస్త్ర చికిత్సలు నిర్వహించ డంలో కిమ్స్ శిఖర హాస్పిటల్ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. కిమ్స్ శిఖర హాస్పిటల్ రోగులకు ప్రపంచ స్థాయి వైద్య సేవలు అందించడంలో తన ప్రాముఖ్యతను మరింత ముందడుగు వేయడంతో పాటు వైద్య సాంకేతిక నైపుణ్యాల లో నిరంతర అభివృద్ధిలో ముందుకు సాగుతుందని తెలిపారు.

# సాయి సాధన చిట్‌ఫండ్స్ కేసు గుంటూరుకి బదిలీ




నరసరావుపేట, మేజర్ న్యూస్ : నరసరావుపేట సాయి సాధన చిట్ ఫండ్స్ ఖాతాదారులు , డిపాజిట్ దారులను భారీస్థాయిలో మోసగించినట్లు వేలూరు సుబ్బారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నమోదు చేసిన కేసు గుంటూరు లోని 6 వ అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారి కోర్టుకు బదిలీ అయింది. ఈ కేసును గుంటూరు 6వ అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారి కోర్టుకు బదిలీ చేయవలసిందిగా పోలీస్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ మేరకు స్థానిక 13వ అదనపు జిల్లా న్యాయస్థానంలో పాలడుగు పుల్లారావు కుటుంబ సభ్యులు దాఖలు చేసుకున్న ముందస్తు బెయిల్ పిటిషన్ కూడా గుంటూరు జిల్లాప్రధాన న్యాయ స్థానానికి బదిలీ అయింది. ఈ మేరకు బుధవారం నరసరావుపేట 13వ అదనపు జిల్లా న్యాయస్థానం ఏపీపీ మల్లారెడ్డి కోర్టులో రిప్రజెం టేషన్ చేశారు. ఈ కేసులో సంస్థతో పాటు మరో ఆరుగురిని పోలీసులు నిందితులుగా పేర్కొన్నారు. పాలడుగు పుల్లారావు, ఆయన భార్య వాణిశ్రీ కుమారుడు పవన్ కుమార్, కుమార్తె శ్రీహర్షవర్ధిని, అల్లుడు ప్రముఖ హృద్రోగ నిపుణులు డాక్టర్ నూకవరపు రాజా రమేష్, నకరికల్లు మండలం కండ్లకుంట గ్రామానికి చెందిన గాలికోటయ్యలు ఈ కేసులో నిందితులుగా ఉన్నారు.

# అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం

- 2011 జనాభా ప్రాతిపదికన ఎస్సీ వర్గీకరణపై హర్షం
- సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపిన మీరయ్య





నరసరావుపేట రూరల్, మేజర్ న్యూస్ : ఎస్సీ వర్గీకరణను 2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్ర యూనిట్‌గా ప్రారంభించాలని మంత్రివర్గ సమావేశంలో సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేయడం హర్షించదగిన విషయం అని ఎమ్మార్పీఎస్ఎస్ ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షులు చింతిరాల మీరయ్య మాదిగ పేర్కొన్నారు. ఈమేరకు ఎమ్మార్పీఎస్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బుంగ సంజయ్ మాదిగ పిలుపుమేరకు ఆయన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. గురువారం పల్నాడు జిల్లా, నరసరావుపేట క్లాక్ టవర్ వద్ద అంబేద్కర్ విగ్రహం, సీఎం నారా చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మీరయ్య మాదిగ మాట్లాడుతూ, 2024లో అధికారంలోకి వచ్చిన వెంటనే ఎస్సీ వర్గీకరణ చేస్తానని మాట ఇచ్చిన సీఎం మాట నిలబెట్టుకున్నారు. వర్గీకరణ అంశాన్ని తెరమీదకు తీసుకు రావడంతో పాటు రాజన్ రంజాన్ మిశ్రా ఐఏఎస్ ఎస్సీ వర్గీకరణ అంశం మీద జిల్లాల వారీగా అభిప్రాయాలు సేకరించే విధంగా కమిషన్ వేసి జిల్లాల వారీగా నివేదిక, ఆ నివేదిక ఒక వారం క్రితం ముఖ్యమంత్రి కార్యాలయానికి సీల్డ్ కవర్లో రాజన్ రంజాన్ మిశ్రా పంపించడం జరగడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఆ కమిటీ నివేదిక ప్రకారం వెంటనే ఎస్సీలలో ఉన్న మంత్రులతో క్యాబినెట్ తీర్మానం చేసి ఎస్సీ వర్గీకరణకు పచ్చ జెండా ఊపిన ఘనత చంద్రబాబుకు దక్కుతుందని చెప్పారు. అలాగే డీఎస్సీ నోటిఫికేషన్ కూడా ఎస్సీ వర్గీకరణ అయిన తర్వాతనే అమలు చేయాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కు విజ్ఞప్తి చేశారు. ఎస్సీ మాలలు ఎక్కువ అనేదానికి ఏక సభ్య కమిషన్ ఇచ్చిన నివేదికలో మాదిగలు 35 లక్షలు కాగా, 2007 ప్రకారం మాలలు 32,34, 250 మంది ఉన్నారు. దాని నిష్పత్తి ప్రకారమే ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉన్నట్లు తెలుస్తోంది. 59 ఉపకులాలకు సమాన న్యాయం చేయడం కోసమే ఈ ఎస్సీ వర్గీకరణ బిల్లును చట్టబద్ధత చేసి క్యాబినెట్ తీర్మానం చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ఎస్ నాయకులు కేసానుపల్లి చినబాబు, మల్లెల మధు, సాల్మన్, ముప్పాళ్ళ పెద్ద గురవయ్య పాల్గొన్నారు.

# మంగళగిరిలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ





- 6వ వార్డుకు చెందిన ఆకులూరి ప్రసన్న కుమార్‌కు రూ.8 లక్షల 41 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత
- మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో లబ్ధిదారుడికి చెక్కులు అందజేసిన టీడీపీ నాయకులు
- మంత్రి నారా లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపిన లబ్ధిదారులు

**మంగళగిరి మేజర్ న్యూస్ :** మంగళగిరి నియోజకవర్గంలోని ప్రజలు కష్టకాలంలో ఉంటే తక్షణమే స్పందించి మంత్రి నారా లోకేష్ వారికి అండగా నిలుస్తున్నారని రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య అన్నారు. గురువారం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను టీడీపీ నాయకులు అందజేశారు. మంగళగిరి పట్టణంలోని 6వ వార్డుకు చెందిన ఆకులూరి ప్రసన్నకుమార్ గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ వివిధ ప్రైవేట్ ఆసుపత్రులలో చికిత్స పొందారు. అతడి ఆర్థిక ఇబ్బందులను ఆ వార్డుకు చెందిన టీడీపీ నాయకులు మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకువెళ్ళారు. వెంటనే స్పందించిన మంత్రి నారా లోకేష్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో మాట్లాడి ఆకునూరి ప్రసన్నకుమార్ పరిస్థితిని వివరించారు. దీంతో సీఎం చంద్రబాబు నాయుడు రూ. 8,41,988 లను సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరు చేయించారు. మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో టీడీపీ నాయకులు ఆకులూరి ప్రసన్నకుమార్ ఇంటికి వెళ్లి మంజూరు పత్రాలు అందజేశారు. అలాగే 15వ వార్డుకు చెందిన మంచాల శ్యాంసుందర్‌కు రూ. 50,891 వేలు, 12వ వార్డుకు చెందిన మహమ్మద్ సాదిక్‌కు రూ. 20,541 వేలు, 9వ వార్డుకు చెందిన గంజి లీలాకు రూ. 1,00,290 విలువైన చెక్కులు అందజేశారు. చెక్కులు రావడానికి కృషి చేసిన మంత్రి నారా లోకేష్‌కు లబ్ధిదారుల కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నందం అబద్దయ్య మాట్లాడుతూ వైద్య ఖర్చులు భారమై అనేక ఆర్థిక ఒడిదుడుకులు పడుతున్న పేద ప్రజలకు ఆపన్న హస్తం అందించేందుకు కూటమి ప్రభుత్వం అనేక రకాలుగా కృషి చేస్తుందని, దానిలో భాగంగా ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా అనేకమంది పేదలను ఆదుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పాలకమండలి సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, రాష్ట్ర సాధికార సమితి సభ్యులు అన్నం నాగబాబు, తాడిబోయిన వెంకటేశ్వర్లు, వంగర సదా శివరావు, నందం బాబురావు, పందిరి వెంకన్నబాబు, జొన్నాదుల రామాంజనేయులు, నైనాల లావణ్య, మల్లెల కళ్యాణ్ చక్రవర్తి, మహమ్మద్ ఇబ్రహీం, మాజేటి సూర్య వేణుగోపాలకృష్ణ శ్రేష్టి, సంకా బాలాజీ గుప్తా, కొదమల సైమన్, గోసాల రాఘవ మల్లెల నాగయ్య, ఎండి ఆరిఫ్, బుల్లా రాము, రావూరి విజయనంద్, బచ్చుల హోనక్, పొట్టాబత్తుల నరసింహారావు, కామినేని భగవంతరావు, కందులపురం లక్ష్మయ్య, ఎనుముల ఆనందబాబు, ఇందనం కనకరావు తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కార్మికుల ధర్నా



**పిడుగురాళ్ల, మేజర్ న్యూస్ :** మున్సిపల్ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో పిడుగురాళ్ల మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి , అనంతరం కమిషనర్ పర్వతనేని శ్రీధర్ కి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి తెలకపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. పారిశుద్ధ కార్మికులకు పెండింగ్లో ఉన్న వేతనాలు వెంటనే ఇవ్వాలని ,చెప్పులు, సబ్బులు, నూనెలు, యూనిఫామ్ వెంటనే ఇవ్వాలని, ఐదు మచ్చుల పాయింట్లు రద్దుచేసి ఒకే మచ్చుల పాయింట్ దగ్గర హాజరు నిర్వహించాలని, ఎండలు తీవ్రంగా ఉన్నందున పని ప్రదేశాల్లో మంచినీళ్ల, సౌకర్యం కల్పించాలని, పండగ సెలవులు ,క్యాజువల లీవులు, అమలు చేయాలని, టిఎల్ఎఫ్ కార్మికులకు పెండింగ్లో ఉన్న మూడు నెలల వేతనం వెంటనే విడుదల చేయాలని, కరోనా సమయం నుండి పనిచేస్తున్న కార్మికులను వెంటనే ఆప్కాస్ గా చేర్చాలని, అకారణంగా తొలగించిన కాంద్రగుంట మేరమ్మని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పనిబారం తగ్గించాలని, అదనపు పనులు చేసిన కార్మికులకు రెండు ఆఫ్ డ్యూటీలు కలిపి ఒకరోజుగా పరిగణించాలని, ఆప్కాస్ సమస్తను రద్దుచేసి ,ఏళ్ల తరబడి పనిచేస్తున్న కాంట్రాక్టర్ కార్మికులను పర్మినెంట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పారిశుద్ధ కార్మికులు కుంభ కొండలు ,ప్రతాపు, మార్తమ్మ, దేవుళ్ళ పరమేశు, చల్లా పద్మ, మేరీ గ్రేస్ ,దేవి, ఎలమంద, కంప సాగర్, బత్తుల పార్వతి తదితరులు పాల్గొన్నారు.

# 'ఏపీ హోంగార్డుల కోసం చర్యలు తీసుకోవాలని డిమాండ్'

- టీడీ జనార్ధన్‌ను కలిసిన ఏఐవైఎఫ్ రాష్ట్ర నేత సుభాని
- త్వరలో సీఎం చంద్రబాబు అపాయింట్మెంట్‌కు అవకాశం




**నరసరావుపేట రూరల్, మేజర్ న్యూస్ :** ఏపీకి చెందిన హోంగార్డులు తెలంగాణలో ఉద్యోగం చేస్తున్న వారిని వెనక్కి తీసుకురావాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎస్కే.సుభాని డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం ఆయన టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు టీడీ జనార్ధన్ ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా సుభాని మాట్లాడుతూ, రాష్ట్ర విభజన తర్వాత ఏపీకి చెందిన అన్ని శాఖల ఉద్యోగులను తెలంగాణ నుంచి తీసుకు రావడం జరిగిందని పేర్కొన్నారు. ఒక్క హోంగార్డులు విషయంలో మాత్రం ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. ఇప్పటికే పదేళ్లు కాలయాపన చేశారని, వారు కుటుంబాలకు దూరంగా ఎంతోమంది క్షోభకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వృద్ధాప్యంలో తల్లిదండ్రులు, భార్య బిడ్డలకు దూరంగా ఉండాల్సిన దుస్థితి మన పాలకులు వల్ల నెలకొందని అభిప్రాయపడ్డారు. ఇదిలాగే కొనసాగితే రాబోయే రోజుల్లో హోంగార్డుల పిల్లలు కూడా స్థానికతపై అనిశ్చిత పరిస్థితులు ఎదుర్కోవలసి వస్తుందని చెప్పారు. ఈ విషయాలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని జనార్ధన్ కు సుభాని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన ఆయన, త్వరలోనే సీఎంను కలిసేందుకు అపాయింట్మెంట్ కల్పించే దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు.

## గోల్డ్ మెడల్ సాధించిన వినుకొండ వాసి



**వినుకొండ మేజర్ న్యూస్ :** గోల్డ్ మెడల్ సాధించిన విద్యార్థిని వినుకొండ సీనియర్ న్యాయవాది ఎం.వి అప్పారావు శ్రీలక్ష్మి దంపతుల కుమార్తె దేవి ప్రసన్న కు ఎమ్మెస్సీ యోగ థెరపీ లో గోల్డ్ మెడల్ సాధించినందుకు గాను సెంట్రల్ యూనివర్సిటీ విద్య పీఠం లో 2023 - 2024 సంవత్సరానికి గురువారం తిరుపతిలో మహతి ఆడిటోరియంలో వైస్ ఛాన్సలర్ గొల్లపల్లి కృష్ణమూర్తి చేతుల మీదగా బంగారు పథకాన్ని అందుకున్నారు. 4 వ స్నాతకోత్సవం సందర్భంగా ఆడిటోరియంలో వైస్ ఛాన్సలర్ గొల్లపల్లి కృష్ణమూర్తి చేతుల మీదగా అందుకున్నారు. ఇది తెలుసుకున్న పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు అభినందనలు తెలిపారు.

## ఐఐటీలో 25వ ర్యాంకు సాధించిన హేమంత్



**నూజెండ్ల మేజర్ న్యూస్ :** గేట్-2025 పరీక్షలో ప్రస్తుతం ఐఐటీ మద్రాస్ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ ఫైనల్ ఇయర్ చదువుతున్న ఘంటా హేమంత్ 25వ ర్యాంక్ సాధించాడు. హేమంత్ తల్లిదండ్రులు సుజాత, నాగేశ్వరరావు నూజెండ్ల మండలంలో ఉపాధ్యా యులుగా పని చేస్తున్నారు. హేమంత్ సోదరుడు ఐఐటీ మద్రాస్లో సీఎస్సీ ఇంజినీరింగ్ 3వ సంవత్సరం చదువుతున్నాడు. 25వ ర్యాంక్ సాధించిన హేమంత్ కు పలువురు అభినందనలు తెలియజేశారు.

## సిమ్స్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్‌లో మెగా జాబ్ మేళా



**గుంటూరు, రూరల్ మేజర్ న్యూస్ :** గుంటూరు నగరంలో మ్యాజిక్ బస్సు ఇండియా ఫౌండేషన్,సిమ్స్ గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ ఇరువురు ఆధ్వర్యంలో గురువారం మెగా జాబ్ మేళా నిర్వహించడం జరిగింది. సిమ్స్ కళాశాలలో జరిగిన ఈ మెగా జాబ్ ఫెయిర్‌కి నిరుద్యోగులు అనేకమంది తరలివచ్చారు. ఈ సందర్భంగా మ్యాజిక్ బస్సు ఫౌండేషన్ సెక్రటరీ డాక్టర్"బి.శివ శిరీష మాట్లాడుతూ ఈ యొక్క జాబ్ ఫెయిర్ కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన ఫైనాన్స్, ఫార్మా, నాన్ ఐ.టి, ఐ.టి, ఎం.ఎన్.సీ, మ్యానుఫ్యాక్చరింగ్, హాస్పిటాలిటికి సంబంధించి 35 కంపెనీలు వచ్చాయని, మొత్తం 700 మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని ఆమె తెలిపారు. అలాగే ఈ ఇంటర్వ్యూలో ఎంపికైన విద్యార్థులకు ఇదే రోజున గురువారం సాయంత్రం ఉద్యోగ నియామక పత్రాలు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముందుగా సిమ్స్ గ్రూప్ ఆఫ్ సంస్థల డైరెక్టర్ బి.భరత్ రెడ్డి చేతుల మీదుగా రిబ్బన్ కటింగ్ చేసి జాబ్ ఫెయిర్ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమానికి వందలాదిమంది విద్యార్థులు,నిరుద్యోగులు,తరలివచ్చి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.

## చిలువూరు గ్రామంలో ఎంపీ నిధులతో వంతెన నిర్మాణానికి శ్రీకారం



**దుగ్గిరాల, మేజర్ న్యూస్ :** దుగ్గిరాల మండల పరిధిలోని చిలువూరు గ్రామంలో వంతెన నిర్మాణానికి గురువారం దుగ్గిరాల మండల ఇన్చార్జి ఎంపీపీ షేక్ జబీన్ శ్రీకారం చుట్టారు. 42 లక్షల రూపాయల పార్లమెంటు నిధులతో వంతెన నిర్మాణానికి కొబ్బరికాయలు కొట్టి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో దుగ్గిరాల మండల ఇన్చార్జి ఎంపీపీ షేక్ జబీన్, ఎంపీటీసీ మరియ రోజమ్మ, గ్రామ సర్పంచి చిలువూరు మాణిక్యం, తోటకూర సీతారామయ్య, చిలువూరు శేషగిరి, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

## మార్చి 28వ తేదీనే జీతాలు జమ చేయండి

**ఏపీ గ్రామ వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ అబ్దుల్ రజాక్**



**పిడుగురాళ్ల, మేజర్ న్యూస్ :** రాబోవు ముఖ్య పండగల దృష్ట్యా అనగా మార్చి 30 వ తేదీన ఉగాది, మార్చి 31 వ తేదీన రంజాన్ సందర్భంగా, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని పండగలకు ముందుగానే అనగా మార్చి 28 లేదా 29 వ తేదీనే, మార్చి నెల జీతాన్ని ఉద్యోగుల ఖాతాల్లో జమ చేయాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు షేక్ అబ్దుల్ రజాక్ ప్రభుత్వాన్ని కోరారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు రావలసిన కరువు భత్యాలను ( డి.ఎ ) మంజూరు చేయాలని, తక్షణమే మధ్యంతర ప్రకటించాలని, 12 వ పే రివిజన్ కమిషన్ ను నియమించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## ఘనంగా శ్రీకాంత్ పుట్టినరోజు వేడుకలు



**మాచవరం మేజర్ న్యూస్ :** మాచవరం మేజర్ పంచాయతీలోని మాజీ సొసైటీ పర్సన్ ఇంచార్జ్, మండల వైసిపి నాయకులు అంబటి కోటయ్య తనయుడు అంబటి శ్రీకాంత్ పుట్టినరోజు వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. శ్రీకాంత్ పుట్టినరోజు సందర్భంగా ఏర్పాటు చేసి కేకును వైసిపి రాష్ట్ర వైద్యుల అధికార ప్రతినిధి డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్ హాజరై శ్రీకాంత్ చే కేక్ కట్ చేయించి శ్రీకాంత్ కు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాచవరం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ రాగిడి నరేష్, నల్ల మేకల తిరు పాల్, కావాటి అయ్యప్ప, రాగిడి ప్రకాష్, పుసులూరి శ్రీనివాసరావు, చింతపల్లి రఫీ తదితరులు పాల్గొన్నారు.

## పద్మశ్రీ డాక్టర్ గోపాలకృష్ణ గోఖలే నేతృత్వంలో మెడికల్ క్యాంప్

**గుంటూరు మేజర్ న్యూస్ :** మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 23వ తేదీ ఆదివారం గుంటూరులోని జె.కె.సి. కళాశాల ప్రాంగణంలో గుండె జబ్బుల ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు మానవత చైర్మన్ పావులూరి రమేష్, వైద్య విభాగ చైర్మన్ టి. ధనుంజయ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీ హాస్పిటల్ డొంక రోడ్డు వారి సౌజన్యంతో నిర్వహిస్తున్న గుండె జబ్బుల ఉచిత వైద్య శిబిరానికి ప్రముఖ కార్డియో థోరాసిక్ వాస్కోలర్ సర్జన్ గుండె ఊపిరితిత్తుల ట్రాన్స్ ప్లాంట్ సర్జన్ పద్మశ్రీ డాక్టర్ ఆళ్ళ గోపాలకృష్ణ గోఖలేతో పాటు సీనియర్ ఇంటర్ వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ బి.వి.నారాయణరెడ్డి, ఇంటర్ వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ వై. రామ కిషోర్ తో పాటు పలువురు వైద్యులు పాల్గొంటారని ఉచితంగా షుగర్, బిపి, ఈసీజీ, ఏకో పరీక్షలు నిర్వహించి వైద్యుల సలహా మేరకు మందులను ఉచితంగా పంపిణీ చేస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈనెల 23వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం 12:30 గంటల వరకు ఈ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తామని ప్రజలు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

## కళామందిర్ సెంటర్‌లో 'డ్రగ్స్ వద్దు బ్రో'



**పల్నాడు జిల్లా క్రైమ్ న్యూస్:** పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు. ఉత్తర్వుల మేరకు డ్రగ్స్ పై అవగాహన కలిగించే కార్యక్రమంలో భాగంగా గురువారం సాయంత్రం కళామందిర్ సెంటర్‌లో ఆటో యూనియన్ సభ్యులతో మీటింగ్ ఏర్పాటు చేసి వారి ఆటోల మీద డ్రగ్స్ వద్దు బ్రో " అనే స్టిక్కర్ లను అంటించి అందరినీ ఈ మంచి కార్యక్రమంలో భాగస్వామ్యులు కావాలని తెలియజేసిన చిలకలూరిపేట పట్టణ సీఐ పి. రమేష్. కార్యక్రమంలో చెన్నకేశవులు, రహంతుల్లా, శివరామకృష్ణ ఎస్సైలు, ట్రాఫిక్ ఏఎస్ఐ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## విధి నిర్వహణకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అవసరం

**పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు**

పల్నాడు జిల్లా క్రైమ్ న్యూస్ : విధుల నిర్వహణకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఎంతో అవసరం అని పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో నూతన చట్టాలపై అవగాహన, శిక్షణ కార్యక్రమం గురువారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్లలోని కానిస్టేబుళ్ళలో చాలామంది ఉన్నత విద్యను అభ్యసించి, ఎన్నో నైపుణ్యాలు కలిగిన వారు ఉన్నారు.వారిలోనీ నైపుణ్యాలను వెలికి తీసి, వాటికి మెరుగులు దిద్ది, పోలీస్ స్టేషన్లో వారు అన్ని విధులు నిర్వర్తించే విధంగా తర్ఫీదు ఇప్పించి తద్వారా వారు సాధికారిత సాధించడం కోసం ఈ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించామని తెలిపారు. పోలీస్ స్టేషన్లో ప్రతి కానిస్టేబుల్ అన్ని విధులు నిర్వహించడం తెలిస్తే,పని భారం ఒకరి మీద పడకుండా అన్ని పనులను అందరూ పంచుకోవచ్చు. అప్పుడు చేసే పని చాలా సులువుగా మారి, పనిచేయాలన్న ఉత్సాహం వారిలో పెంపొందుతుంది. కావున అందరు కూడా అన్ని పనులు నేర్చుకోవాలని ఉద్దేశంతో ఈ శిక్షణా తరగతులను ప్రారంభించడం జరిగింది. కార్యక్రమంలో జిల్లాలోని పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఎంటీఎంసీలో నాలుగో రోజు స్వచ్ఛ-మంగళగిరి కార్యక్రమం

**మంగళగిరి 5,6 వార్డులు, తాడేపల్లి 3వ వార్డులో స్వచ్ఛ-మంగళగిరి నిర్వహించిన అధికారులు, నాయకులు**





**తాడేపల్లి, మేజర్ న్యూస్ :** స్వచ్ఛ-మంగళగిరి కార్యక్రమంలో భాగంగా గురువారం మంగళగిరి పట్టణం 5,6 వార్డులోని ఇందిరానగర్, మూడు పంపుల సెంటర్, స్కూలు రోడ్డు, తాడేపల్లి పట్టణం 3వ వార్డులో అధికారులు, కూటమి నాయకులు ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టారు. వార్డులలో ఇంటింటికి వెళ్లి పారుశుద్ధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. రోడ్డుపక్కన వేసిన చెత్తను, డంపింగ్‌లను తొలగించి శుభ్రం చేశారు. స్వచ్ఛ మంగళగిరి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంటీఎంసీ కమిషనర్ యస్. అలీం బాషా మాట్లాడుతూ ప్రజలు అందరూ కూడా మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బందికి సహకరించాలని కోరారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకూడదని ఇళ్ల వద్దకే వచ్చే వాహనాల్లో వేయాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ కె శకుంతల, డిప్యూటి కమిషనర్ శ్రీకాంత్, సెక్రటరీ యం దివ్యకుమారి, అసిస్టెంట్ ఇంజనీరు కుమారి, టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్ సుస్మిత, శానిటరి ఇన్స్పెక్టర్ ఆర్ ఇందు, ప్రత్యేక పర్యావరణ కార్యదర్శి ఉదయ్ సింగ్, నియోజకవర్గ పరిశీలకులు ముమ్మిడి సత్యనారాయణ, తాడేపల్లి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు,రాష్ట్ర పద్మశాలి డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కందుల నాగార్జున, మంగళగిరి పట్టణ తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు గోవాడ దుర్గారావు, పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, కృష్ణ బలిజి సాధికార సమితి సభ్యుడు అన్నం నాగబాబు, వాకా మాధవరావు, భోగి కోటేశ్వరరావు, గొర్ల వేణుగోపాల్ రెడ్డి, తాడిబోయిన భాస్కర్, మండవ గోపాలరావు, ఇట్టా పేంచలయ్య, ఇట్టా భాస్కర్, వనమా సుధాకర్, సీమాన్, శివ,దాసరి చిన్ని, అడపా నరేష్, నక్కా నవీన్ రాజా, హరే రామ్, జి అంకల రావు, అన్నం కుసుమ, కాటాబత్తుని నిర్మల, పత్రపల్లి కృష్ణవేణి, నాగుల మేరీ, షేక్ సలాం, యార్లగడ్డ ప్రసాద్, సంకూర్ సతీష్ ,కోగంటి వెంకటేశ్వరావు, కొయ్యగూర మల్లేశ్వరరావు, బి సాంబిరెడ్డి, బేజ్జం రామకృష్ణ, కంతేటి విజయ్, అద్దంకి మురళి, కంతేటి విజయ్, వినుకొండ నవీన్, జొన్నాదుల రామాంజనేయులు, నైనాల లావణ్య, నల్లగొర్ల శివరామకృష్ణ, గోసాల రాఘువ, పేరం ఏడుకొండలు, వీరబాబు, మరియు నగరపాలక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సాంకేతికతో విద్య వ్యవస్థలో సమూల మార్పులు

- **సమాజ ప్రయోజనకరముగా పరిశోధనలు కొనసాగాలి**
- **ఆచార్య అల్లం శ్రీనివాసరావు, ఉపకులపతి, విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం**



**ఏ ఎన్ యు / పెదకాకాని మేజర్ న్యూస్ :** ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఆధునిక సాంకేతికతను జోడించి విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకురావచ్చు అని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం, ఉపకులపతి, ఆచార్య అల్లం శ్రీనివాసరావు అన్నారు. వర్సిటీ ఫిజిక్స్ విభాగం ఆధ్వర్యంలో బహుళ క్రియాత్మక పదార్థాలలో ఉద్భవిస్తున్న పోకడలు మరియు పురోగతులు అంశంపై రెండు రోజుల యు జి సి జాతీయ సదస్సు గురువారం ప్రారంభమైంది. కార్యక్రమానికి వర్సిటీ ఉపకులపతి ఆచార్య కే. గంగాధరరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆచార్య అల్లం శ్రీనివాసరావు మాట్లాడుతూ విశ్వవిద్యాలయాల్లో జరుగుతున్న పరిశోధనలు సమాజానికి ప్రయోజనకరంగా మారాలని తెలిపారు. నూతన విద్యా విధానం వల్ల విద్య రంగంలో సంస్కరణలు రావడంతో పాటు, కొన్ని సవాళ్లు కూడా ఎదురుకోవాల్సి వస్తుందని చెప్పారు. దేశంలోకి ప్రైవేట్ యూనివర్సిటీల రాకతో ప్రభుత్వ విశ్వవిద్యాలయాలలో పరిశోధన ఇతర అంశాలను పటిష్ట పరచి విద్యార్థులను ఆకర్షించే విధంగా అడుగులు వేయాలని సూచించారు. భవిష్యత్తు కాలంలో క్వాంటం ఫిజిక్స్ నిష్ణాతులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మెండుగా లభిస్తాయని తెలిపారు. వర్సిటీ ఉపకులపతి ఆచార్య కే. గంగాధరరావు మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో సాంకేతిక పరిజ్ఞానం పాత్ర రోజురోజుకు పెరుగుతుందన్నారు. నూతన సాంకేతిక పరిజ్ఞానంపై విద్యార్థులు, పరిశోధకులు దృష్టి సారిస్తేనే ఉత్తమ ఫలితాలను పొందవచ్చు అన్నారు. గృహ వినియోగానికి ఉపయోగపడే పరికరాల నుండి, స్పేస్ టెక్నాలజీకి అనుగుణంగా పరికరాల తయారీలో ఫిజిక్స్ పాత్ర కీలక మన్నారు. అన్ని రంగాల్లో టెక్నాలజీతో సమూల మార్పులు జరుగుతాయని వివరించారు.వర్సిటీ రెక్టర్ ఆచార్య కే. రత్నశిలామణి మాట్లాడుతూ స్పేస్ టెక్నాలజీ రోబోటిక్స్ వంటి రంగాలలో ఉపాధి అవకాశాలను కైవసం చేసుకునేందుకు ఆ దిశగా విద్యార్థులు ప్రయత్నాలు కొనసాగించాలని కోరారు. మెటీరియల్ తయారీ మరిన్ని నవకల్పనలు రావాలని చెప్పారు.వర్సిటీ రిజిస్టర్ ఆచార్య జి. సింహాచలం మాట్లాడుతూ సమాజంలో ప్రతి రంగంలో వినియోగిస్తున్న వస్తువుల తయారీలో జీవ సాంకేతికత అంశాలు ప్రాధాన్యం కలిగి ఉన్నాయని తెలిపారు. సాలి పురుగు నుండి విడుదలయ్యే ఫైబర్ను బుల్లెట్ ప్రూఫ్ జాకెట్ తయారీకి వినియోగిస్తున్నారని తెలిపారు.జాతీయ సదస్సు డైరెక్టర్ ఆచార్య చేబ్రోలు లింగరాజు మాట్లాడుతూ , వర్సిటీ, యుజీసీ సౌజన్యంతో నిర్వహిస్తున్న జాతీయ సదస్సుకు 150 పైగా పరిశోధన వ్యాసాలు వచ్చాయని తెలిపారు. వివిధ రంగాలలో నిష్ణాతులచే ఉపన్యాసాలు అందిస్తున్నట్లు చెప్పారు. ఉత్తమ పరిశోధన వ్యాసాలను అంతర్జాతీయ జర్నల్స్ లో ప్రచురితం చేస్తామని వెల్లడించారు. పర్యావరణహితమైన సాంకేతికతో కాలుష్య నివారణ డి ఆర్ డి ఓ సైంటిస్ట్ డాక్టర్ కే. వీరబ్రహ్మం. పర్యావరణహితమైన సాంకేతికతో ఎలాంటి కాలుష్య నివారణ చేపట్టవచ్చని డి ఆర్ డి ఓ సైంటిస్ట్ డాక్టర్ కే. వీరబ్రహ్మం అన్నారు. తొలి రోజు జాతీయ సదస్సులో కీలక ఉపన్యాసం అందిస్తూ... పెరుగుదల కాలుష్యాన్ని నివారించేందుకు ప్రతి పౌరుడు కృషి చేయాలని తెలిపారు. ప్లాస్టిక్ వస్తువులను ఎక్కడపడితే అక్కడ పడవేయకుండా నిర్ణయించిన చెత్తబుట్టలో వేయాలని సూచించారు. పాలిథిన్ ప్లాస్టిక్ బ్యాగులు భూమిలో కలవడానికి దాదాపు 500 సంవత్సరాలు పడుతుందని చెప్పారు. ఈ సంచులను వినియోగించడం వల్ల కాలుష్య కారణంతో పాటు, పశువులు తినడం వల్ల ప్రాణహాని నెలకొంది అన్నారు. ప్లాస్టిక్ వాటికి ప్రత్యామ్నాయంగా డి ఆర్ డి ఓ వారు బయో డీగ్రేడబుల్ సాంకేతికత తో బ్యాగులను తయారు చేయటం, పరిశ్రమల ఔత్సాహికులకు శిక్షణ ఇవ్వటం, అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వాలు, ఎం ఎస్ ఎం ఈ, స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి బయో డిగ్రేడబుల్ పరిశ్రమల స్థాపనకు ప్రోత్సహించాలన్నారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం ఏకకాల వినియోగించే ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు, ప్లేట్లు, కప్స్ తదితర వస్తువుల తయారీపై నిషేధం ప్రకటించింది. బయో డిగ్రేడబుల్ క్యారీ బ్యాగులు 90 నుండి 120 రోజుల్లో ఎరువుగా మారుతుందని, పశువులు ఆహారముగా తిన్న ఎలాంటి నష్టాలు ఉండమని తెలిపారు. ఇదే టెక్నాలజీతో తిరుమల తిరుపతి దేవస్థానంలో లడ్డు, ప్రసాదాల విక్రయాలకు అనుగుణంగా ప్యాకెట్లను తయారుచేసామని చెప్పారు. కార్యక్రమంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య వీరయ్య, ఓ ఎస్ డి, వైస్ ప్రిన్సిపల్ ఆచార్య ఆర్ వి ఎస్ ఎస్ రవికుమార్, సదస్సు కో కన్వీనర్ ఆచార్య వి రవికుమార్, ఆచార్య జి నాగరాజు, విశ్రాంత ఆచార్యులు వీరయ్య, దూర విద్యా కేంద్రం పరీక్షల కో-ఆర్డినేటర్ ఆచార్య రామచంద్రన్, వర్సిటీ పీజీ ప్రవేశాల సంచాలకులు ఆచార్య బ్రహ్మాజీ, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సాగునీరు విడులచేసి మిర్చి పంటను రక్షించండి..

## డిఇ విజయలక్ష్మీకి రైతులు, రైతు సంఘాల నాయకులు వినతి



**నరసరావుపేట మేజర్ న్యూస్ :** పల్నాడు జిల్లాలో వారాబందీ అమలులో ఉన్న నేపథ్యంలో ఎండ తీవ్రతకు మిర్చి పంట ఎండిపోతుందని నీరు విడుదల చేసి పంటలను రక్షించాలని రొంపిచర్ల మండలం వీరవట్నం గ్రామానికి చెందిన మిర్చి రైతులు ఏపి రైతు, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో నరసరావుపేట లింగంగుంట్ల గ్రామంలో గల నాగార్జున సాగర్ సంతగుడిపాడు సర్కిల్ డిఇ ఎస్.విజయలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. పంటకు నీరు ఇవ్వకపోతే తీవ్రంగా నష్టపోతామని వాపోయారు. ఈ సందర్భంగా రైతు సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపూరి గోపాలరావు మాట్లాడుతూ లక్షల రూపాయల పెట్టుబడులు ఒకవైపు చీడపీడల బెడద మరోవైపు ధరలు లేమితో తీవ్ర ఆందోళనలో ఉన్న రైతులకు నీటి కష్టాలు తోడు కావడంతో మరింత ఉక్కిరిబిక్కిరి అవుతున్నారన్నారు. ఎన్నో వ్యయ ప్రయాసల మధ్య పంటలు సాగు చేస్తున్న రైతులు పంటను కాపాడుకునేందుకు సాగు నీటి కోసం ఆందోళన చెందడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. నాగార్జున సాగర్ జలాశయంలో గతంలో డెడ్ స్టోరేజ్ ఉన్న సమయంలో కూడా సాగుకు సరిపడా నీరు విడుదల చేసిన విషయాన్ని గుర్తు చేశారు. తక్షణమే రైతుల అవసరం మేరకు సాగు నీరు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రైతులను ఏకం చేసి పోరాటం చేస్తామని హెచ్చరించారు. కౌలు రైతు సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు కామినేని రామారావు మాట్లాడుతూ రైతులు ఏయే పంటలు సాగు చేశారు, ఎన్ని రోజులు పాటు ఎంత మేర నీటి అవసరాలు ఉన్నాయో ఎన్ఎస్.పి అధికారుల దగ్గర వివరాలు లేకపోవడం వారి నిర్లక్ష్య ధోరణికి నిదర్శనమన్నారు. ప్రస్తుతం సాగులో ఉన్న మిర్చి, మొక్కజొన్న, దాల్వా వరిసాగు ఇతర కూరగాయ పంటలు సాగు చేస్తున్న రైతులు నష్టపోకుండా ఉండాలంటే ఏప్రిల్ 20 వరకు సాగునీరు ఇవ్వాల్సిందేనన్నారు. స్పందించిన డిఇ ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని తక్షణమే నీరు విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రైతులు ఎం వెంకట్రావు, నరేష్ , వెంకట సుబ్బారావు, ఆంజనేయులు, వెంకటాద్రి, హరిబాబు, అప్పారావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ

**వెల్దుర్తి. మేజర్ న్యూస్ :** వెల్దుర్తి మండలంలోని యర్రబాలెం గ్రామం నందు గల ఐ.టి.డి.ఎ పాఠశాలలో బుధవారం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం, ఐ.టి.డి.ఎ ప్రాజెక్టు ఆధ్వర్యంలో స్థానిక టిడిపి నాయకులు నిత్యావసర వస్తువులు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామ టీడీపీ నాయకులు పేదలకు నిత్యవసర సరుకులను అందజేశారు. కూటమి ప్రభుత్వంలో నిరుపేద కుటుంబాలకు చేయూత అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లుగా టిడిపి సీనియర్ నాయకులు రాయంకుల కృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు నలబోతుల రవి, అలవాల రామారావు పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# రైతులందరూ ప్రకృతి వ్యవసాయ విధానాలు అవలంబించాలి!

## పల్నాడు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కే.అమల కుమారి




**నరసరావుపేట, మేజర్ న్యూస్ :** బెల్లంకొండ మండలం బెల్లంకొండ రైతు సేవ కేంద్రం లో మండల స్థాయి వ్యవసాయ శాఖ , ఉద్యానవన శాఖ అనుబంధ శాఖలు,వెలుగు సిబ్బంది, ప్రకృతి వ్యవసాయశాఖల తో మండలం లెవెల్ కన్వర్జెన్సీ మీటింగ్ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ మీటింగుకి ముఖ్య అతిథులుగా ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ అమల కుమారి, మండల వ్యవసాయ శాఖ అధికారి కృష్ణయ్య వెలుగు ఏ పి ఎం ఉషా , స్టేట్ రిసోర్స్ పర్సన్స్ లక్ష్మీ,మాన్విత,ఉషా,జిల్లా మోడల్ మండల్ టీం లీడ్ పవన్ హాజరు కావడం జరిగింది. ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె అమల కుమారి మాట్లాడుతూ ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ లో భాగంగా ప్రతి ఒక్క రైతు తనకున్న మొత్తం భూమిని ప్రకృతి వ్యవసాయం కింద నమోదు చేసుకోవాలని అంతే కాకుండా తనకున్న మొత్తం పొలంలో పీఎండిఎస్ (నవధాన్య) విధానాన్ని అమలు చేయాలని ఈ విధానం వలన భూమి సారవంతం కావడమే కాకుండా వేసవి కాలంలో వారి కుటుంబ అవసరాలకు కావలసిన ఆకుకూరలో కూరగాయలు లభిస్తాయని పశువులకు మేతగా ఉపయోగపడుతుందని తరవాత వేయ బోయే ప్రధాన పంట లో చీడ పిడలు ల నివారణ జరుగుతుంది అని తెలియజేయడం జరిగింది. స్టేట్ రిసోర్స్ పర్సన్ లక్ష్మీ మాట్లాడుతూ ప్రతి ఒక్క కుటుంబం ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను వినియోగించుకోవాలని ప్రతి సోమవారం మండల ఆఫీస్ దగ్గర ప్రకృతి ఉత్పత్తుల విక్రయ కేంద్రం ఏర్పాటు చేయడం జరుగుతుందని ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని దాని ద్వారా వారు హాస్పిటల్స్ కు వెచ్చించే ఖర్చు తగ్గుతుందని చెప్పడం జరిగింది .మండల వ్యవసాయ అధికారి కృష్ణయ్య మాట్లాడుతూ ఈ సంవత్సరం ప్రతి రైతు వారికున్న మొత్తం భూమిలో పి ఎం డి ఎస్ (నవధాన్య) విధానం ఆచరించాలని ఈ విధానం వలన భూమిలో కర్బన శాతం పెరుగుతుందని ప్రస్తుతం రైతుల భూముల్లో కర్బన శాతం 0.5 కన్నా తక్కువగా ఉందని భూమిలో కర్బన శాతం తక్కువగా ఉండటం వలన పంటలకు చీడపీడల ఉధృతి ఎక్కువగా ఉంటుందని పంటలో రోగనిరోధక శక్తి తక్కువగా ఉంటుందని భూమిలో కర్బన శాతం పెంచాలి అంటే ప్రతి ఒక్క రైతు ఈ ప్రకృతి వ్యవసాయ విధానాలు అవలంబించాలని సూచించడం జరిగింది. వివిధ రకాల సూక్ష్మజీవులు వృద్ధి చెందుతాయని చెప్పడం జరిగింది . ఏపీఎం ఉషా మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామ ఐక్య సంఘం పరిధిలో ఈ నవధాన్యాల కిట్స్ తయారు చేసే విధంగా రైతులందరూ అందే విధంగా చూస్తామని చెప్పడం జరిగింది. అడిషనల్ ప్రాజెక్ట్ మేనేజర్ ప్రేమరాజు మాట్లాడుతూ యానిమేటర్ తన పరిధిలోని స్వయం సహాయక సంఘాల్లో గల ప్రతి రైతును ప్రకృతి వ్యవసాయం వైపు తీసుకువెళ్లాలని ప్రతి ఒక్కరూ కిచెన్ గార్డెన్ ఉండేవిధంగా చూడాలని సంఘము లోని ప్రతి రైతు ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ లో పేర్లు నమోదు చేయాలని చెప్పడం జరిగింది. ప్రస్తుతం మార్కెట్లో లభిస్తున్న కూరగాయలు ఆకులు తీసుకోవడం వల్ల వాటిలో విషపూరితమైన రసాయన పురుగు మందులు అధికంగా ఉన్నందువలన భయంకరమైన క్యాన్సర్ గుండె జబ్బు రక్తహీనత వస్తుందని సూచించడం జరిగింది. ప్రకృతి వ్యవసాయంలో నవధాన్య సాగు చేసి ఉత్తమ ఫలితాలు సాధించిన రైతులకు సన్మానం చేయడం జరిగింది. తరువాత వేసవికాలంలో కూడా విత్తనాలు మొలకెత్తడానికి వీలుగా విత్తన గుళికల విధానం ఎలా చేయాలో డెమో చేసి చూపించడం జరిగింది ఈ కార్యక్రమానికి మండల సీసీలు బ్రహ్మం ,సైదా,రామస్వామి మల్లీశ్వరి, జిల్లా శిక్షకుడు సైదయ్య, డివిజన్ మాస్టర్ ట్రైనర్ జయ లక్ష్మీ, మండల ఎంటీఎల్ పవన్ కుమార్, ఆనంతలక్ష్మి, అంజలి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మరియు రైతులు పాల్గొనడం జరిగింది.

# నగరాభివృద్ధి పై డ్రోన్ నిఘా

## కమిషనర్ పులి శ్రీనివాసులు



**గుంటూరు నగర పాలక సంస్థ, మేజర్ న్యూస్ :** నగర పాలక సంస్థ నగరాభివృద్ధి పై ప్రత్యేక పర్యవేక్షణకు డ్రోన్ విధానాన్ని శుక్రవారం నుండి అమలు చేస్తామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. గురువారం సాయంత్రం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో డ్రోన్‌లను స్వయంగా ఆపరేట్ చేసి పలు ప్రాతాలలోని పారిశుధ్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో డ్రోన్ల ద్వారా వివిధ అభివృద్ధి పనుల పర్యవేక్షణలో భాగంగా కార్యాలయం నుండే నగరంలో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను, అనధికార కట్టడాలను, త్రాగు నీటి సరఫరా పైపు లైన్ల లీకులను, పార్కులు, డివైడర్లు, జంక్షన్లు, వీధి దీపాలు, నగర పాలక సంస్థ నిర్మిస్తున్న రోడ్లు, డ్రైన్లు, నగర పాలక సంస్థ వాహనాలను క్షేత్ర స్థాయిలో తనిఖీకి ఈ డ్రోన్ల విధానం ద్వారా శులభతరం అవుతుందన్నారు. సమస్యాత్మక ప్రాంతాలను నగరపాలక సంస్థ కార్యాలయం నుండే పర్యవేక్షణ చేయనున్నామన్నారు. తూలుతగా ఒక డ్రోన్ ను నగర పాలక సంస్థ కొనుగోలు చేసిందని, త్వరలో ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక, ఇంజనీరింగ్ విభాగాలకు ప్రత్యేకంగా 3 డ్రోన్లను నగరపాలక సంస్థ తరుపున అందుబాటులోకి తెస్తామని, దీని ద్వారా నగరంలో జరిగే ప్రతి అభివృద్ధి కార్యక్రమంపై ప్రత్యేక నిఘా ఉంటుందని, సమస్యలను గుర్తించిన వెంటనే సత్వర పరిష్కారం కొరకు నేరుగా చర్యలు తీసుకొనుటకు ఎంతో దోహద పడుతుందన్నారు. నగరంలో డ్రోన్ వినియోగ అనుమతి కొరకు పోలీసు శాఖ అనుమతుల కోసం లేఖ పంపామన్నారు. క్షేత్ర స్థాయిలో సిబ్బంది పనితీరుని కూడా మెరుగుదల చేసేలా డ్రోన్ ఉపయోగపడనున్నాయని తెలిపారు.

# మహిళలు భద్రతకు శక్తి యాప్ రక్షణ కవచం



**పల్నాడు జిల్లా క్రైమ్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మహిళలు,బాలికల భద్రత కొరకు శక్తి యాప్ (శక్తి యాప్)ను ప్రవేశపెట్టడం జరిగింది. కావున ఈ రోజు శ్రీ పల్నాడు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని పాఠశాలల నందు మరియు ప్రధాన కూడల్ల నందు స్కూలు విద్యార్థును లతో సెల్ఫ్ డిఫెన్స్ (స్వీయ రక్షణ) ప్రజలకు శక్తి యాప్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ ఈ యాప్ రూపొందించుటకు ముఖ్య ఉద్దేశం. ఈ యాప్ ప్రధానంగా మహిళలపై జరిగే వేధింపులు,అత్యాచారాలు, మరియు ఇతర హింసాత్మక సంఘటనలను నివారించటానికి ఎంతగానో ఉపయోగపడుతుంది అని కావున పల్నాడు జిల్లాలో ప్రతీ ఒక్క మహిళ,గృహిణిలు విద్యార్థినిలు,బాలికలు వారి యొక్క ఫోన్లు నందు ఈ శక్తి యాప్ ను నిక్షిప్తం చేసుకుని ఆపద సమయంలో పోలీసు వారి తక్షణ సహాయం, సహకారం పొందాలని పోలీసు శాఖ తెలపడం జరిగింది. ఆపదలో ఉన్న మహిళలు ఎవరైనా ఎస్.ఓ.ఎస్ బటన్ ప్రెస్ చేస్తే వారు ఉన్న ప్రాంతం వివరాలు దగ్గర్లో ఉన్న పోలీస్ స్టేషన్ నకు డయల్ 112 నెంబరుకు చేరుతుందని వెంటనే పోలీసులు అప్రమత్తమై సంఘటన స్థలానికి చేరుకొని వారికి రక్షణ కల్పించే విధంగా చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఈ స్వీయ రక్షణ (సెల్ఫ్ డిఫెన్స్) కార్యక్రమం ముఖ్య ఉద్దేశం మహిళలలో విద్యార్థును లలో అత్యవసర సమయాలలో తనను తాను ఎలా రక్షించుకోవాలో మెలకువలు తెలియజేయడం జరిగింది. అదేవిధంగా విద్యార్థి దశ నుంచి వారి మనోధైర్యాన్ని పెంపొందించుటకు కావలసిన సెల్ఫ్ డిఫెన్స్ (స్వీయ రక్షణ) తోడుపడుతుందని తెలిపారు. ఈ సెల్ఫ్ డిఫెన్స్ కార్యక్రమం నరసరావుపేటలోని రామిరెడ్డి పేట నందు గల సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహం నందు నిర్వహించడం జరిగింది. జిల్లా మహిళలకు ముఖ్య విజ్ఞప్తి మహిళలు, బాలికలు, విద్యార్థినులు, ఉద్యోగినులు, గృహిణులు అత్యవసర పరిస్థితుల్లో రక్షణ అవసరమైన వారు ఈ యాప్ ద్వారా మరింత భద్రంగా ఉండగలరు మరియు అత్యవసర సమయంలో పోలీస్ వారి యొక్క సహాయాన్ని పొందగలరు అని,మహిళలు, చిన్నారులు తమకు ఎదురయ్యే వివిధ పిర్యాదులు,ఇబ్బందులపై పోలీసు వారి సహాయం కొరకు శక్తి యాప్ ద్వారా పొందవలనని,సిబ్బంది తక్షణమే స్పందించి డయల్ 112 కాల్స్ ను దగ్గరలోని పోలీస్ స్టేషన్ కు సమాచారం చేరవేస్తే పోలీసు సిబ్బంది సంఘటన స్థలానికి వెళ్లి వారికి తక్షణ సహాయం, సహకారం అందిస్తారని, కావున జిల్లాలో ప్రతీ ఒక్క మహిళ, విద్యార్థినిలు,బాలికలు,ఉద్యోగినులు, గృహిణులు మీ యొక్క ఫోన్లు నందు ఈ శక్తి యాప్ ను నిక్షిప్తం(డౌన్లోడ్) చేసుకోవాలని జిల్లా పోలీసు అధికారులు కోరారు.ఈ కార్యక్రమంలో మహిళా పోలీసు అధికారులు మరియు మహిళా పోలీస్ సిబ్బంది, నవోదయ డిగ్రీ కాలేజ్ గురజాల, శ్రీ చైతన్య పబ్లిక్ స్కూల్ నరసరావుపేట సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహం నరసరావుపేట నందు నిర్వహించడం జరిగింది.

## సాంస్కృతిక కార్యక్రమాల్లో ఆకట్టుకున్న చీఫ్ విప్ జీవీ స్కిట్




**వినుకొండ మేజర్ న్యూస్ :** మూడు రోజుల పాటు జరిగిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల చివరి రోజు స్కిట్‌తో అందర్నీ కడుపుబ్బా నవ్వించారు చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు. రాజకీయ నాయకులు ఎదుర్కొనే చిత్రమైన పరిస్థితులను కళ్లకు కట్టారు చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు బృందం. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఇదీసంగతి అంటూ హాస్య నాటకం ప్రదర్శించిన చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, ఎమ్మెల్యేలు విష్ణుకుమార్ రాజు, జూలకంటి బ్రహ్మానంద రెడ్డి, కూన రవికుమార్, పాశం సునీల్, అరవింద బాబు, వర్ల కుమార్ రాజా అందర్నీ ఆకట్టుకున్నారు. చీఫ్‌విప్ జీవీ, ఎమ్మెల్యే విష్ణుకుమర్‌రాజు మధ్య సన్నివేశాలతో మొదలైన నాటకం ఆద్యంతం నవ్విస్తునే సాగింది. నాయకులు ఎదుర్కొనే క్లిష్ట పరిస్థితుల్ని సున్నితంగా చెప్పింది. విష్ణుకుమార్ రాజు తమ ఊరి అల్లుడిని మొదలు పెట్టమంటూ అడిగే విన్నపంతోనే అందరిలో నవ్వులు మొదలయ్యాయి. తమ కుమారుడికి సీట్ కావాలని... సబ్జెక్ట్ లు పాస్ కాకపోయినా తెలుగుదేశం నేతలకు చెందిన నారాయణ, భాష్యం, విజ్ఞాన్, ఎన్నారై కళాశాలల్లో సీటు ఇప్పించాలంటూ అమాయక పాత్రలో మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానంద రెడ్డి ఆ నవ్వులు మరింత పెంచారు. పాస్ కాకపోతే ఏమిటి కనీసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ లో సీటు ఇప్పించలేని ఎమ్మెల్యే ఎందుకంటూ హాస్యం పండించారు జూలకంటి. అలాంటి పరిస్థితుల్లో ఏ ఎమ్మెల్యే అయినా సీటు ఇప్పించలేడంటూ కార్యకర్త కోరిక తీర్చలేక.. సమాధాన పరచలేక సహనం పాటించే పాత్రలో జీవీ ఆంజనేయులు జీవించారు. అనంతరం పది పాస్ కాని విద్యార్థికి హెడ్‌మాస్టర్ లేదా ఎస్పీ ఉద్యోగం కావాలంటు ఎమ్మెల్యే అరవింద్ బాబు, బాలయ్య బాబు, పవన్ కళ్యాణ్ తో సినిమా డైరెక్షన్ ఇప్పించాలంటూ కార్యకర్త పాత్ర పోషించిన కూన రవి నవ్వులు పూయించారు. ఈ స్కిట్ సాగుతున్నంతసేపు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేష్ సహా ప్రతిఒక్కరూ నవ్వుతునే కనిపించారు.

# నేటి నుంచి విజ్ఞాన్ నిరులోత్సవ్-2కే25

- విజ్ఞాన్ నిరుల ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయస్థాయి పోటీలు
- రెండు రోజుల పాటు జరగనున్న పోటీలు
- మొత్తం 45కు పైగా విభాగాల్లో పోటీలు
- 15వేల మందికి పైగా హాజరవుతున్న విద్యార్థులు

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**

గుంటూరు రూరల్ మండలం పలకలూరులోని విజ్ఞాన్ నిరుల మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో నేటి నుంచి రెండు రోజుల పాటు జాతీయస్థాయి టెక్ ఒడిస్సీ, కల్చరల్ కాస్కేడ్, క్రియేటివ్ కాన్వస్, వర్డ్ సింఫణీ, బిజినెస్ పరేడ్, చిల్ థ్రిల్, స్పోర్ట్స్ ఫెస్ట్ జరుగుతున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పాతూరి రాధిక గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యి విజ్ఞాన్ నిరులోత్సవ్-2కే25కు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ పాతూరి రాధిక మాట్లాడుతూ మొదటి రోజు జరిగే ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏపీఎస్‌సీహెచ్‌ఈ (ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్) చైర్మన్ ప్రొఫెసర్ కే.మధుమూర్తి, గౌరవ అతిథిగా ఐబీఎం ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ టెక్నికల్ టీమ్ లీడ్, విజ్ఞాన్ నిరుల పూర్వ విద్యార్థి నరేడ్ల లావణ్య హాజరవుతారని పేర్కొన్నారు. శనివారం జరిగే ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ట్ తిపాఠి, గౌరవ అతిథిగా యాంకర్, విజ్ఞాన్ పూర్వ విద్యార్థి ప్రదీప్ మాచిరాజు హాజరవుతారని తెలియజేసారు. ఫెస్ట్‌కు సుమారుగా 200 కళాశాలల నుంచి 15 వేల మందికి పైగా విద్యార్థులు పాల్గొంటారని వెల్లడించారు. ఉత్సవాల్లో భాగంగా విద్యార్థులకు సాంస్కృతిక, క్రీడాంశాల్లో జాతీయస్థాయిలో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఇంజనీరింగ్, ఎంబీఏ విద్యార్థులతోపాటు డిగ్రీ, ఇంటర్ విద్యార్థులు కూడా ఈ పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు.


విజ్ఞాన్ నిరులోత్సవ్-2కే25 పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విజ్ఞాన్స్ సంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, ప్రిన్సిపల్ పాతూరి రాధిక, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, విద్యార్థులు

**45కి పైగా విభాగాల్లో పోటీలు**

జాతీయ ఉత్సవాల్లో భాగంగా మొత్తం 45 కు పైగా అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆయా అంశాలను టెక్ ఒడిస్సీ, కల్చరల్ కాస్కేడ్, క్రియేటివ్ కాన్వస్, వర్డ్ సింఫణీ, బిజినెస్ పరేడ్, స్పోర్ట్స్ ఫెస్ట్.... ఇలా ఏడు విభాగాలుగా విభజించినట్లు చెప్పారు. డాన్స్, మ్యూజిక్, థియేటర్ షో, ఫ్యాషన్ వార్, టాలెంట్ హంట్, మైమ్, రీలాథాన్, టీజర్ ట్విస్ట్, డూడుల్ వార్, పేయింటింగ్, మాక్ పార్లిమెంట్, పొయెట్రీ స్లామ్, డిబేట్, షార్ట్ స్టోరీ, బిజినెస్ క్విజ్, యంగ్ మేనేజర్, మార్కెట్ మేకర్స్, త్రోబాల్, ఖోఖో, టెన్నికాయిట్, షాట్‌పుట్, వాలీబాల్, కబడ్డీ, షటిల్, చెస్, క్యారమ్స్, 100 మీటర్ల పరుగు పందెం, మిస్ నిరులోత్సవ్, మిస్టర్ నిరులోత్సవ్, టెక్నికల్ క్విజ్, రాపిడ్ కోడ్, రిసిస్టర్ రష్, ఎలక్ట్రో క్రాస్, డబ స్మాష్, సినీ క్వెస్ట్, విజన్ మాస్టర్... ఇంకా తదితర అంశాల్లో పోటీలు ఉంటాయని తెలిపారు. తొలి రెండు స్థానాల్లో నిలిచిన వారికి ఆకర్షణీయ నగదు బహుమతులు, మెడల్స్, సర్టిఫికెట్లు అందజేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో విజ్ఞాన్స్ సంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, ప్రిన్సిపల్ పాతూరి రాధిక, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.


విలేకరులు కావలెను

నేటి దినపత్రిక సూర్య

అక్షరానికి నైతికతను అద్ది దేశవ్యాప్తంగా 23 ఎడిషన్లతో సామాజిక న్యాయం వైపు మళ్ళించే యజ్ఞం "నేటి దినపత్రిక సూర్య" చేపట్టింది, అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ యజ్ఞంలో "నేటి దినపత్రిక సూర్య" అక్షర సైనికులను మరి కొంత మందిని నియమించుకోవాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా పల్నాడు, గుంటూరు జిల్లాలలో ఖాళీగా ఉన్న మండలాలకు విలేకరులకు నియమించుకోవదలిచాము. కావలెను. ఆసక్తిగల వారు ఈ క్రింది మండలాలకు ఈ నెల 31వ తేదీలోగా ఇంటర్వ్యూకి ఈ క్రింది అడ్రస్సులో సంప్రదించగలరు.

1.తాడికొండ, 2. తుళ్ళూరు, 3. మేడికొండూరు, 4. ఫిరంగిపురం, 5. ప్రత్తిపాడు, 6. పెదనందిపాడు, 7. కాకుమాను, 8.వట్టిచెరుకూరు, 9.అమరావతి, 10.గుంటూరు రూరల్, 11.గుంటూరు జిల్లాపరిషత్, 12. దాచేపల్లి, 13. బొల్లాపలి, 14. పెదకూరపాడు, 15. పొన్నూరు

పి. బాలు (చిన కొండయ్య)
బ్యూరో ఇన్‌చార్జి, ఉమ్మడి గుంటూరు జిల్లా. సెల్ : 9705554777

జిల్లా ఇన్‌చార్జిలు: జి.శ్రీనివాసరావు సెల్ : 9959426987 ఆర్.డి.నాయక్ సెల్ : 8897455466

ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రాంతీయ కార్యాలయం, 9/1, అరండల్‌పేట, గుంటూరు.



నేటి దినపత్రిక సూర్య కుటుంబ సభ్యులు

నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com

"నేటి దినపత్రి సూర్య" ను ఆదరిస్తున్న గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని విశేష పాఠకులు, అధికారులు, రాజకీయ నాయకులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేస్తున్నాం... ఏదైనా వార్తలు, ప్రకటనలు, యాడ్స్, క్లాసిఫైడ్స్, లీగల్ నోటీసులు ఇలాంటి ప్రకటనలను మా ఈ క్రింది పాత్రికేయులకు తెలియజేయగలరు. నరసమైన ధరలకు యాడ్స్ పబ్లిష్ చేయబడును. మా పత్రికలో పనిచేస్తున్న పాత్రికేయ బృందం.

పి. బాలు (చిన కొండయ్య) - బ్యూరో ఇన్‌చార్జి, ఉమ్మడి గుంటూరు జిల్లా. సెల్ : 9705554777
జి.శ్రీనివాసరావు - గుంటూరు జిల్లా ఇన్‌చార్జి సెల్ : 9959426987
ఆర్.ధావుర్య నాయక్ (సూర్య ఆర్.డి.) - స్టాఫ్ రిపోర్టర్, గుంటూరు జిల్లా. సెల్ : 8897455466
ఎం.ఏడుకొండలు - సత్తెనపల్లి ఆర్.సి. ఇన్‌చార్జి సెల్ : 9030880455
జి.హిరణ్మాయి (కన్నల్) - నరసరావుపేట ఆర్‌సి ఇన్‌చార్జి జిల్లా క్రైమ్ రిపోర్టర్
చెట్టిపోగు కాశి - దాచేపల్లి రిపోర్టర్ సెల్ : 9963343327
శేషగిరి రాజు - మాచర్ల ఆర్సీ ఇన్‌చార్జి సెల్ : 8341408201
వై.ఏసుబాబు - గురజాల ఆర్సీ ఇన్‌చార్జి సెల్ : 9701250872
బి.పూర్ణచంద్రరావు - సత్తెనపల్లి రిపోర్టర్ సెల్ : 9866246951
చెవుల రంగారావు - మెడికల్ రిపోర్టర్, గుంటూరు సెల్ : 9490544635
యం.కృష్ణ - మంగళగిరి ఆర్‌సి ఇన్‌చార్జి సెల్ : 9393309149
వి.రవికుమార్ - తెనాలి ఆర్‌సి ఇన్‌చార్జి సెల్ : 99083 38200
డి. చైతన్య - వినుకొండ ఆర్‌సి ఇన్‌చార్జి సెల్ : 9381968453
వి.లూథర్ - నరసరావుపేట రిపోర్టర్ సెల్ : 7799382078
జి.ఏలియా - ముప్పాళ్ళ రిపోర్టర్ సెల్ : 9392231959
బి.సాంబశివరావు - రాజుపాలెం రిపోర్టర్ సెల్ : 9949382676
రమేష్ - దుగ్గిరాల రిపోర్టర్ సెల్ : 9866782780
ఎస్.వెంకటేశ్వర్లు - పెదకాకాని రిపోర్టర్ సెల్ : 9948175840
కె.నాగరాజు - రిపోర్టర్, గుంటూరు సెల్ : 7799881000
డి.రమేష్ - ఈపూరు రిపోర్టర్ సెల్ : 9110734898
పి.లక్ష్మీనారాయణ - నూజెండ్ల రిపోర్టర్ సెల్ : 9666474953
ఎస్.కె. రవూఫ్ - శావల్యాపురం రిపోర్టర్ సెల్ : 7989434737
అక్కిరెడ్డి - నరసరావుపేట మెడికల్ రిపోర్టర్ సెల్ : 9849134987
బి.గురవయ్య - వినుకొండ క్రైం రిపోర్టర్ సెల్ : 9908340426
వి.లక్ష్మీనారాయణ - రెంటచింతల రిపోర్టర్ సెల్ : 8500079075
పి.వెంకటేశ్వర్లు - దుర్గి రిపోర్టర్ సెల్ : 8185815858
టి.శ్రీకాంత్ - వెల్దుర్తి రిపోర్టర్ సెల్ : 9912818723
పి.మణికంఠ - మాచర్లటౌన్ రిపోర్టర్ సెల్ : 7013169885
ఎస్.డి.మహబూబ్ - మాచర్ల క్రైం రిపోర్టర్ సెల్ : 9989124898
ఎం.కోటేశ్వరరావు - మాచవరం రిపోర్టర్ సెల్ : 6303775169
డి.మల్లికార్జునరావు - యడ్లపాడు రిపోర్టర్ సెల్ : 8309237441
రమేష్ - క్రోసూరు రిపోర్టర్ సెల్ : 9493148828
ఎస్.విజయభాస్కర్ - గుంటూరు రిపోర్టర్ సెల్ : 9440822538
షేక్ నాగూర్ - నకరికల్లు రిపోర్టర్ సెల్ : 98489 26300
పి.ఆనంద్ - వినుకొండ రూరల్ రిపోర్టర్ సెల్ : 8125125239
నాగరాజు - మంగళగిరి టౌన్ రిపోర్టర్ సెల్ : 9032258913
రమేష్ - నరసరావుపేట రూరల్ రిపోర్టర్ సెల్ : 7075942600
వి.వెంకటరెడ్డి - బొల్లాపల్లి రిపోర్టర్ సెల్ : 80191 99991

"నేటి దినపత్రిక సూర్య" ఉమ్మడి గుంటూరు జిల్లా కార్యాలయం. 9/1, అరండల్‌పేట, గుంటూరు.